మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట



# యోగాతో మానసిక ఆరోగ్యం



**రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు**

**కొల్లాపూర్, జూన్ 21 ప్రభాతవార్త :** యోగ సాధనతో శారీరక ఆరోగ్యంతో పాటు, మానసిక ఆరోగ్యాన్ని పొందవచ్చని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా కొల్లాపూర్‌లో పతాంజలి యోగా సమితి ఆద్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి జూపల్లి ప్రజలు, విద్యార్థులతో కలిసి యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ యోగా భారతీయ ఘన వారసత్వ సంపదని, యోగా ప్రాచీన సంస్కృతిలో ఒక భాగమని, మన జీవన విధానంలో వచ్చిన మార్పుల కారణంగా పడుతున్న ఇబ్బందులను అధిగమించడానికి ప్రాచీన జీవన విధానాన్ని అనుసరించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. యోగా, ధ్యానంతో మానసిక ఒత్తిడి, శారీరక రుగ్మతలను అధిగమించవచ్చాన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు చిన్న వయసు నుంచే యోగా, ధ్యానం, వ్యాయామాన్ని అలవాటు చేయాలని సూచించారు. ప్రతి ఒక్కరూ నిత్యం ఒక గంట పాటు శారీరక వ్యాయామం చేయాలని, తద్వారా మానసిక, శారీరక సమతుల్యం కలుగుతుందని చెప్పారు.

# స్వచ్ఛ గ్రామాల వైపు ప్రయాణం ప్రారంభం

- ◆ గ్రామీణ సుస్థిర అభివృద్ధికి లక్ష్యాలను సాధించాలి
- ◆ పనుల్లో పురోగతి ఉండేలా చర్యలు చేపట్టాలి
- ◆ జీవన ప్రమాణాల మెరుగుదలకు స్వచ్ఛతే బాట
- ◆ వనమహోత్సవ కార్యక్రమం పగడ్బందీగా అమలు చేయాలి
- ◆ నాగర్‌కర్నూలు జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్



సమావేశంలో మాట్లాడుతున్న నాగర్‌కర్నూలు జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూన్ 21 ప్రభాతవార్త:** గ్రామీణ సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధిస్తూ, స్వచ్ఛ భారత్ మిషన్ ద్వారా చేపట్టిన వివిధ పనుల్లో ఎప్పటికప్పుడు పురోగతి ఉండేలా చర్యలు చేపట్టాలని, వనమహోత్సవ కార్యక్రమం, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పనులను వేగవంతం చేయాలని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం నాగర్ కర్నూల్‌జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో స్వచ్ఛభారత్ మిషన్, స్వచ్ఛ సంరక్షణ్, ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా చేపట్టిన వివిధ పనుల పురోగతిపై ఎంపీడీవోలు, ఎంపీవోలు, ఏపీవోలు, అదనపు కలెక్టర్ దేవ సహాయంలతో నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీల సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధిస్తూ, గ్రామ పంచాయతీలో పరిశుభ్రత, పచ్చదనంతో పాటు స్వచ్ఛ సర్వేక్షన్ లక్ష్యాలను అధిరోహించి, గ్రామీణ ప్రాంతాలను మరింత అభివృద్ధికి కృషి చేయాలని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అధికారులను ఆదేశించారు. ప్రతి గ్రామంలో స్వచ్ఛ సర్వేక్షన్ ద్వారా చేపట్టిన పనులను పర్యవేక్షించేందుకు కేంద్ర బృందాలు జిల్లాలో పర్యటించనున్నట్లు కలెక్టర్ ఈ సందర్భంగా తెలిపారు. జిల్లాలోని 461 గ్రామ పంచాయతీల్లో స్వచ్ఛభారత్ మిషన్ ద్వారా చేపట్టిన పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా గ్రామాల్లో పచ్చదనం -మిగతా4లో..

# అప్పులు.. తిప్పలు





- ◆ ప్రతి ఇంటా అప్పుల కుప్పలే
- ◆ పేదోడికి పెరుగుతున్న ఆర్భాటాల అవసరాలు
- ◆ ఇల్లాలు నుంచి పిల్లల వరకు అప్పులే
- ◆ సంపదంతా వడ్డీ వ్యాపారులకు ప్రైవేట్ లోన్‌లకే సరి
- ◆ ఏటా పెరుగుతున్న ఆర్థిక ఇబ్బందులు ఆత్మహత్యలు
- ◆ కుటుంబాలలో విచ్ఛిన్నం అవుతున్న ప్రేమానురాగాలు
- ◆ సామాన్యుడు మధ్యతరగతి కుటుంబాలకు జీవనోపాధికి సంకటం

**వనపర్తి, జూన్ 21 ప్రభాతవార్త :** కొన్ని దశాబ్దాల క్రితం ఉమ్మడి కుటుంబాలు ఇల్లును చక్కపెట్టే తరుణంలో నాడు అప్పు అంటేనే ఆ కుటుంబం వణికిపోయేది. ఆ పరిస్థితి రాకూడదని దేవుళ్లకు మొక్కుకునేవారు. ఉన్న దాంట్లోనే సర్ది పెట్టుకోవడమే తప్ప అప్పు జోలికి వెళ్లేందుకు తాతల కాలం నాటి రోజుల్లో జంకేవాళ్లు. అంతకంటే మించి అప్పు తీసుకుంటే ఆ కుటుంబానికి అప్రతిష్టే.. సమాజంలో పెద్దింటిగా మెలిగిన వారికి ఈ పరిస్థితి నామోషీగా ఉండేది. తమ హీన స్థితికి ఇదొక నిదర్శనంగా భావించేవారు. కష్టించి పనిచేయడమే ధ్యేయంగా మిగిలిన రోజుల్లో అత్యవసరాల్లో తప్ప చేతు బదులుకు కూడా చేజాచని కుటుంబాలు లెక్కకు మిక్కిలి. అప్పట్లో ఇంటి పెద్ద అన్ని పద్దులు సరి చూసుకునేవారు. ఎవరికి ఎంత కావాలో ఏడాదికి ఎంత ఖర్చవుతుందో అంచనాలు వేసుకునేవారు.

**పూర్వం ఆర్భాటాలు ఉండేవి కావు..**

పెళ్లయినా, పేరంటాలైన సోకులకు పోయేవాళ్లు కారు. ఆర్థికంగా కొంత స్థిరపడి క్రమశిక్షణగా మెలిగే కుటుంబాలను అప్పటికి ఇప్పటికీ కూడా పిసినారి అంటూ ట్యాగులు తలిగిస్తారు. అదే స్తోమతకు మించి అప్పులు చేసి సోకులకు పోయే వారిని చూసి మురిసిపోయేవారు ఎందరో. రానురాను ఇంటి ఖర్చులు పెరుగుతున్న నేపథ్యంలో కుటుంబాలు రకరకాల కారణాలవల్ల విచ్ఛిన్నమవుతున్న సందర్భాలు దర్శనమిస్తున్నాయి. పాత రోజుల్లో సహపంక్తి భోజనం చేస్తూ ఎంతో మురిసిపోయేవారు. ప్రస్తుత ఆధునిక సమాజంలో స్తోమత లేకపోయినా అందనంత ఎత్తులో ఆలోచనలు ఉండడంతో లైఫ్ స్టైల్ సెట్ చేసుకోవడం కోసం మితిమీరిన ఖర్చులు చేసి అప్పుల ఊబిలో నలుగుతూ జీవిత చక్రాలను నడిపిస్తున్నారు.

**కష్టపడ్డ సంపాదన బూడిద పాలు..**

పూర్వం రోజుల్లో వ్యవసాయ కూలీలుగా ఉంటూ పొట్ట నింపుకునేందుకు అష్ట కష్టాలు పడి కుటుంబ జీవనం సాగిస్తుండేవారు. ఆధునిక జీవన విధానంలో మార్పులు తలెత్తుతున్న తరుణంలో కుటుంబ జీవనం కొనసాగేందుకు ప్రశ్నార్థకమవుతుంది. ఉమ్మడి కుటుంబంలో అందరూ పనిచేయకపోయినా ఎలాగోలాగా జీవన విధానం నడిచేది. ప్రస్తుతం ఇంట్లో ఇద్దరు లేక నలుగురు పని చేస్తున్నా చీటీలు, ప్రైవేటు ఫైనాన్స్‌లు, బ్యాంక్ అప్పులు మహిళా సంఘాలు ఇలా ఒక్కటేంటి మూడు నాలుగు కట్టడంతో నెల తిరిగేసరికి మరలా మొదటి సమస్యగా తయారైంది. మధ్యతరగతి కుటుంబాలు అంతో ఇంతో నెట్టుకొస్తున్న చేమటోడ్చి కూలి నాలి పని చేసుకుంటున్న మధ్యతరగతి కుటుంబాల బ్రతుకులు చిద్రమవుతున్నాయి.

**మైక్రో ఫైనాన్స్ లోన్‌లతో తల పట్టుకుంటున్న పరిస్థితి..**

లోను కావాలంటే సులుభమైన పని జస్ట్ మిస్డ్ కాల్ ఇస్తే చాలు మేమే వచ్చి మీ డీటెయిల్స్ నమోదు చేసి లోన్‌లు ఇప్పిస్తామని ఏజెంట్లు చెప్పన్న సంగతి తెలిసిందే. అయితే సామాన్య ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకుని వీక్లీ లోన్, మంత్లీ లోన్ టు వీక్స్ లోన్ డైలీ ఫైనాన్స్‌లు చిట్ ఫండ్స్ వంటి వాటిల్లో అమాయక ప్రజలను మోసం చేస్తూ వారు కట్టని పరిస్థితుల్లో తీవ్ర ఒత్తిళ్లు తెచ్చి తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిబంధనలను ఉల్లంఘిస్తూ మైక్రో ఫైనాన్స్ సంస్థ ఉద్యోగులు ,సిబ్బంది అమాయక ప్రజలను నట్టేట ముంచి మళ్లీ వారికిఎక్కడా లోను పుట్టకుండా సిబిల్ పై ప్రభావం చూపుతున్నారు. వీటిపై జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ స్పెషల్ డ్రైవ్ చేపట్టి బాధితులకు భరోసానివ్వాలని కోరుతున్నారు.

# ఎన్నికల తర్వాత రైతు భరోసాకు రామ్ రామ్

**◆ మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి**

**వనపర్తి, జూన్ 21 ప్రభాతవార్త :** స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత రైతు భరోసాకు రామ్ రామ్ పలుకుతున్న కాంగ్రెస్ పార్టీ అని మాజీ మంత్రి పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించక తప్పని పరిస్థితి కాంగ్రెస్ పార్టీకి ఉందనీ. గోపాల్ పేట, రేవల్లి, ఎదుల మండల స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశంలో మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి జిల్లా పార్టీ కార్యాలయంలో శనివారం ఉమ్మడి గోపాల్ పేట మండలం ముఖ్యనాయకుల స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైనామాజీ మంత్రివర్యులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడం అనివార్యం అని అన్నారు. అందుకే బిఆర్ఎస్ శ్రేణులు ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సిద్ధంగా ఉండాలి అని అన్నారు. రేపటి నుండి మండలాల ముఖ్య నాయకులు గ్రామాలలో పర్యటించి ప్రజలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలకు ఎట్లా తూట్లు పొడిచింది అని వివరించండి అదేవిధంగా మన శ్రేణులను ఎన్నికలకు సిద్ధం చేయాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీలు, 6 గ్యారంటీలు అమలు చేయడంలో విఫలమై ప్రజలలో చులకన అయ్యిందని ఎన్నికల అంతరం గ్యారంటీగా రైతు భరోసా ఎత్తివేస్తారని జోస్యం చెప్పారు. ప్రజలలో కెసిఆర్ పట్ల, బిఆర్ఎస్ పార్టీ పట్ల ఆదరణ పెరిగిందని ఈ అవకాశాన్ని అందిపుచ్చుకొని ఎన్నికలలో పోరాడాలని అన్నారు. పార్టీ పట్ల నిబద్ధత, నాయకుణ్ణి పట్ల విధేయత ప్రజల పట్ల విశ్వాసంతో పనిచేసిన నాయకులను అభ్యర్థులుగా నియమించాలని పిలుపునిచ్చారు. ఎన్నికలలో నాయకులు, కార్యకర్తలు ఏవిధంగా వ్యవహరించి ప్రజలకు చేరువ కావాల్సిన వ్యూహాలను నిరంజన్ రెడ్డి వివరించి ఎన్నికలకు సిద్ధం చేశారు. గ్రామాలవారిగా నాయకుల అభిప్రాయాలు స్వీకరించి వాటికి సూచనలు చేశారు. ఈ సమావేశములో జిల్లా అధ్యక్షులు గట్టు యాదవ్ అధికార ప్రతినిధివాకిటి శ్రీధర్ పట్టణ అధ్యక్షులు పి.రమేష్ గౌడ్, జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్, మండల పార్టీ అధ్యక్షులు బాలరాజు, శివరాం రెడ్డి, మాజీ జడ్పిటిసి భీమన్న, మాజీ ఎంపిపిలు సంధ్యతిరుపతయ్య, సేనాపతి, మాజీ సర్పంచులు రమేష్, శేఖర్, హర్యానాయక్, మతిన్, బంకల స్వామి, చిట్యాల రాము, శ్రావణ్ కుమార్ అన్ని గ్రామాల పార్టీ ముఖ్యనాయకులు పాల్గొన్నారు.



ఎన్నికల సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

# ఉపాధ్యాయుల భోజనం నీడలో.. చిన్నారుల భోజనం ఎండలోనా?!

**◆ ఉపాధ్యాయులపై మండిపడ్డ తల్లిదండ్రులు**



నీడలో కూర్చుని తింటున్న ఉపాధ్యాయులు

**దామరగిద్ద, జూన్ 21 ప్రభాతవార్త :** దామరగిద్ద మండల కేంద్రం జిపిఎస్ పాఠశాలలో శనివారం చిన్నారులు మధ్యాహ్నం భోజనం ఎండలో కూర్చొని తింటున్నారు. ఎండలో కూర్చొని భోజనం చేస్తున్న చిన్నారులను చూసిన కొందరు తల్లిదండ్రులు ఉపాధ్యాయుల నిర్లక్ష్యంపై మండపడ్డారు. ఉపాధ్యాయులంతా స్టాఫ్ రూమ్‌లో నీడలో భోజ నం చేస్తూ చిన్నపిల్లలు అనే కనికరం లేకుండా ఎండలో కూర్చోబెట్టి తినిపించడం ఎంత వరకు సమం జసమని ప్రశ్నిస్తున్నారు. కొంతమంది చిన్నారులకు ఎండలో కూర్చోవడం ఇష్టం లేకపోయినా ఉపాధ్యాయుల బెదిరింపు కు తప్పనిసరి తినాల్సి వచ్చిందని పలువురు చిన్నారులు తెలియజేశారు. ఉపాధ్యాయులు చిన్నారుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రభుత్వ పాఠ శాలల్లో ఉపాధ్యాయులు పిల్లల పట్ల శ్రద్ధ చూపడం లేదని పలువులు తెలియజేస్తున్నారు. పాఠశాలకు వచ్చేవాళ్లు వస్తారు పోయేవాళ్ళు పోతారు. ఇలాంటి విషయాలు ఉపా ధ్యాయులకు షరామామూలే అనే విధంగా ఉంది. ఉపాధ్యా యులు మున్ముందు విద్యార్థుల పట్ల ఇంతగా నిర్లక్ష్యం చేయకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది. ఐటంనం3





ఎండలో కూర్చుని తింటున్న విద్యార్థులు

## యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

**మానవపాడు, జూన్ 21 ప్రభాతవార్త :** నిత్యం యోగ సాధనతో సంపూర్ణ ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవచ్చునని ఎంఈఓ శివప్రసాద్ అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని యోగా సాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో యోగ సాధన చేయించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ యోగ సాధన చేస్తే శరీరం ఉత్తేజంగా ఉండటమే కాకుండా మానసిక ప్రశాంతత కూడా పొందవచ్చు అని చెప్పారు. ఈ కార్యక్రమంలో యోగా ట్రైనర్ గాయత్రియునాని మెడికల్ ఆఫీసర్ కరీమున్నీసా, ఉపాధ్యాయులు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

# యోగా మన నిత్యజీవితంలో ఒక భాగం కావాలి

**◆ నారాయణపేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్**

**నారాయణపేట టౌన్, జూన్ 21 ప్రభాతవార్త :** అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా పతాంజలి యోగా సమితి భారత స్వాభిమాన్ ట్రస్టు ఆధ్వర్యంలో నారాయణపేట పట్టణంలోని అబినందన్ గార్డెన్స్‌లో శనివారం 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం 2025 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, ఎమ్మెల్యే పర్ణికరెడ్డి, స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వర్, మార్కెట్ చైర్మన్ శివారెడ్డి, బిజెపి రాష్ట్ర నేత నాగురావు నామాజీ, భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ డా. కె.రాజ్ కుమార్ రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. జయచంద్రమోహన్, మున్సిపల్ కమిషనర్ భోగేశ్వర్లు తదితరులు హాజరై యోగాసనాలు వేశారు. అంతకుముందు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ తన సందేశంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా అందరికీ యోగా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఐక్యరాజ్యసమితి (యునైటెడ్ నేషన్స్) యోగా ప్రాముఖ్యాన్ని గుర్తించి ప్రతి సంవత్సరం జూన్ 21ని అంతర్జాతీయ యోగా దినోత్సవంగా ప్రకటించిందన్నారు. నేడు ఎన్నో దేశాలలో యోగా దినోత్సవం జరపడం ద్వారా యోగాకు నిత్య జీవితంలో ఉన్న ప్రాధాన్యత తెలియజేస్తుందన్నారు.





యోగా డేలో పాల్గొన్న కలెక్టర్, ఎమ్మెల్యే

ప్రతి పాఠశాలలోనూ విద్యార్థులకు చదువుతో పాటు యోగా కూడా చేయించాలన్నారు. యోగా అనేది శారీరక వ్యాయామమే కాదు, ఒక జీవన విధానం అన్నారు. ప్రతిరోజు క్రమం తప్పకుండా యోగా చేసి ఆరోగ్యంగా ఆనందంగా ఉండేలా చూసుకోవాల్సిన బాధ్యత మన అందరిదని చెప్పారు. మనఆధ్యాత్మిక, శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో ఒక అద్భుతమైన సాధనం యోగ. నిత్యం యోగ సాధన ద్వారా మన జీవనశైలిని మెరుగుపరచుకుందాం అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే డా. పర్ణికా రెడ్డి మాట్లాడుతూయోగ జీవన విధానంలో మన ఆరోగ్యానికి ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. యోగాను ప్రతిరోజు ఉదయం తప్పకుండా ఒక ఉద్యమంలో చేస్తే అందరి ఆరోగ్యం కూడా బాగుంటుందన్నారు. -మిగతా4లో..

# ఆరోగ్య సమస్యలను దూరం చేసేందుకే యోగా

**◆ నిత్యం యోగా చేయడం వల్ల శరీరానికి ఆరోగ్యంతో పాటు మానసిక శాంతి ◆ వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**

**వనపర్తి ప్రతినిధి, జూన్ 21 ప్రభాతవార్త:** మారుతున్న జీవన శైలి, పని వత్తిడి వల్ల అనేక ఆరోగ్య సంబంధమైన సమస్యలు ఎదురవుతాయని, ఆరోగ్య సమస్యలను దూరం చేయడానికి ప్రతి దినం యోగా భాగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. శనివారం ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో స్థానిక మర్రికుంట గిరిజన సంక్షేమ పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన యోగా కార్యక్రమంలో కలెక్టర్, అధికారులు విద్యార్థులు పాల్గొని యోగా సాధన చేశారు. జిల్లా యోగా ప్రధాన కార్యదర్శి సుగుణ యోగాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యాంత్రిక జీవితంలో పనిచేస్తూ అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తడానికి అవకాశాలు ఉంటాయని, వాటిని అధిగమించి సంపూర్ణ ఆరోగ్యంతో జీవించడానికి ప్రతి రోజు యోగా చేయాలని సూచించారు. ప్రాచీన కాలం నుండి భారత దేశంలో మన పూర్వీకులు యోగ చేయడం జీవితంలో భాగంగా ఉండేదని, దీనిని 2014 లో భారత ప్రధాని జూన్ 21న ప్రపంచ యోగా దినోత్సవంగా అమలు అయ్యేటట్లు చేశారన్నారు. జూన్ 21 న ప్రపంచ యోగా దినోత్సవం పాటించడానికి కారణం జూన్ 21న సూర్య కాలం మిగతా రోజులకంటే ఎక్కువ సమయం ఉంటుందన్నారు. అదేవిధంగా యువత మాదక ద్రవ్యాల బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. ఎక్కడైనా మాదక ద్రవ్యాలు అమ్ముతున్నట్టు తెలిసిన, వాడుతున్నట్లు తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, మాదక ద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ప్రతిజ్ఞ చేయించారు.



యోగ ఆసనాలు వేస్తున్న జిల్లా కలెక్టర్, విద్యార్థులు

# మహబూబ్‌నగర్ అభివృద్ధికి సహకరించాలి

**-మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి**
**-నూతనంగా బాధ్యతలు చేపట్టిన మంత్రులకు శుభాకాంక్షలు**



మంత్రులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూన్ 21 ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ జిల్లా అభివృద్ధికి అన్ని విధాలా సహకరించాలని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి నూతన మంత్రులను కోరారు. సచివాలయంలో మంత్రులుగా పదవీ బాధ్యతలు స్వీకరించిన రాష్ట్ర కార్మిక, ఉపాధి, మైనింగ్, ఫ్యాక్టరీల శాఖా మంత్రివర్యులు వివేక్ వెంకటస్వామిని, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి, గిరిజన సంక్షేమం, మైనారిటీల సంక్షేమ శాఖా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి -మిగతా4లో..

## రాచూరు బీటీ రోడ్డును పూర్తి చేయలి

**-జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు తల్లోజు ఆచారి**



మాట్లాడుతున్న జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు తల్లోజు ఆచారి

**వెల్దండ, జూన్ 21 ప్రభాతవార్త:** మండలంలోని రాచూరు గ్రామానికి 6 కిలోమీటర్ల మేర మట్టిరోడ్డు ఉండడంతో గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు తల్లోజు ఆచారి అన్నారు. ఈ సందర్భంగా ఆచారి మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల అధికారంలో ఉండి రాచూరు గ్రామానికి బీటీ రోడ్డు నిర్మించలేదని, ఏడాదిన్నర క్రితం ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ నాయకులు బీటీ రోడ్డు నిర్మిస్తామని ప్రజలకు హామీ ఇచ్చి కేవలం -మిగతా4లో..

## మహబూబ్‌నగర్ అదనపు ఎస్పీగా రత్నం బాధ్యతలు

**మహబూబ్‌నగర్, జూన్ 21 ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ జిల్లా అదనపు పోలీస్ సూపరి టెండెంట్‌గా ఎన్.బి రత్నం శనివారం బాధ్యతలు స్వీకరించారు. 1991 జూలై 17న సివిల్ ఎస్ఐగా పోలీస్ శాఖలో సేవ ప్రారంభించిన ఆయన, ఉద్యోగ జీవితంలో అనేక పదవులను చేపట్టారు. ఇటీవలి కాలంలో వనపర్తి జిల్లాలో డిఫోర్‌సి ఇన్‌చార్జి డీఎస్పీగా పనిచేస్తుండగా, అదనపు ఎస్పీగా ప్రమోషన్ రావడంతో హైదరాబాద్ చీఫ్ ఆఫీస్ వెయిటింగ్లో ఉండి, ప్రస్తుతం మహబూబ్‌నగర్ జిల్లాకు అదనపు ఎస్పీగా బదిలీయ్యారు. ఏఎస్పీ స్వగ్రామం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, బాపట్ల జిల్లా, చిన్నగంజాం మండలంలోని సంతరావూరు. గతంలో హైదరాబాద్ సెంట్రల్ జోన్ ట్రాఫిక్ విభాగం సిటీ ట్రైనింగ్ సెంటర్, హైదరాబాద్‌లో డీఎస్పీగా, డి4సి – వనపర్తి జిల్లా ఇన్స్పెక్టర్ హోదాలో, విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ లంగర్‌హౌస్ ఎస్‌హెచ్‌ఓ హైదరాబాద్ సిటీ స్పెషల్ బ్రాంచ్ చిక్కడపల్లి ట్రాఫిక్ ఎస్‌హెచ్‌ఓగా రత్నం గుణాత్మక సేవతో, అత్యుత్తమ నైపుణ్యంతో ప్రజాసేవను ముఖ్యంగా పెట్టుకొని విధులు నిర్వహిస్తూ పోలీస్ శాఖలో విశేష సేవలు అందించారు.

## యోగ ఒక సమగ్ర అభ్యాసం : మాజీ ఎమ్మెల్యే



**నారాయణపేట ప్రతినిధి, జూన్ 21 ప్రభాతవార్త:** అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా శనివారం రాయచూరు నవోదయ మెడికల్ కళాశాల క్యాంపస్‌లో మాజీ శాసన సభ్యులు బిఆర్ఎస్ పార్టీ నారాయణపేట జిల్లా అధ్యక్షులు యస్.రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యోగ అనేది కేవలం శారీరక వ్యాయామం మాత్రమేకాదు, ఇది శరీరం,మనస్సు ఆత్మల మధ్య సమతుల్యతను సాధించడానికి సహాయపడే ఒక సమగ్ర అభ్యాసం అని అన్నారు. అలాగే ఈ రోజు తెలంగాణ ఉద్యమ చుక్కాని తెలంగాణవాదాన్ని ప్రపంచానికిచాటిన మహాజ్ఞాని, తెలంగాణ సిద్ధాంతకర్త భావజాల వ్యాప్తి కోసం తన జీవితం అంకితం చేసిన స్ఫూర్తి ప్రధాత ఆచార్య ప్రొ॥ కొత్తపల్లి జయశంకర్ వర్ధంతి సందర్భంగా వారిని స్మరించుకొంటు ఘన నివాళులు అర్పించారు.

## ఎమ్మెల్యేకు మాస్ లైన్ పార్టీ నాయకుల వినతి



ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

**నారాయణపేట టౌన్, జూన్ 21 ప్రభాతవార్త:** నారాయణపేట మండలం అప్పిరెడ్డిపల్లి గ్రామనికి ఎస్సీ రిజర్వేషన్ సర్పంచ్‌గా ప్రకటించాలని కోరుతూ శనివారం ఎమ్మెల్యే పర్ణిక రెడ్డికి సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ పార్టీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ డివిజన్ నాయకులు ప్రశాంత్ మాట్లాడుతూ గ్రామంలో ఎస్సీలు 400కు పైగానే ఉన్నారన్నారు. అప్పిరెడ్డిపల్లి గ్రామానికి ఎస్సీ రిజర్వేషన్ నేటికీ రాలేదన్నారు. ఇప్పటివరకు బీసీ రిజర్వేషన్ వచ్చిందన్నారు. ఈసారైనా మా గ్రామానికి ఎస్సీ సర్పంచ్ రిజర్వేషన్ ప్రకటించాలాని ఎస్సీలు కోరుతున్నారు. ఎమ్మెల్యేకు వినతి పత్రం అందించిన వారిలో సిపిఐ (ఎంఎల్ )మాస్ లైన్ గ్రామ నాయకులు గణేష్, వడ్డే రాములు, పి.అశోక్, వెంకట్ రాములుతోపాటు తదితరులు ఉన్నారు.

## నిందితుడికి కఠిన శిక్ష పడాలి

● బిజెపి మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు సాహితీ రెడ్డి ఖండన

**జడ్చర్ల, జూన్21 ప్రభాతవార్త:** బాలికపై అత్యాచారం అనేది అత్యంత హేయమైన, అమానవీయమైన ఘటన అని, ఇలాంటి ఘటనలు ఇంకా జరుగుతూనే ఉండడం చాలా దురదృష్టకరమని బిజెపి మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు బి.సాహితీ రెడ్డి ఖండించారు. నిందితుడిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జడ్చర్ల మండలంలోని ఓ గ్రామంలో 8 ఏళ్ల బాలికపై జరిగిన అత్యాచార ఘటనపై ఆమె స్పందించారు. బాధితురాలికి మానసిక, వైద్య సహాయం అందించాలని ప్రభుత్వాన్ని అధికారులను కోరారు. చిన్నపిల్ల అనే కనీస కనికరం కూడా లేకుండా ఇలాంటి దారుణానికి ఒడిగట్టడం అత్యంత అమానవీయ ఘటన అని పేర్కొన్నారు. నిందితుడికి కఠినశిక్ష పడేలా చేయాలని, మరోకరుఇలాంటి దారుణాలకు ఒడిగట్టాలంటేనే భయ భ్రాంతులకు గురయ్యేలా కఠినమైన శిక్షలు అమలు చేయాలని చేయాలని కోరారు. సమాజంలో బాలికలు మహిళలు మరింత సురక్షితంగా ఉండేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఈ సందర్భంగా సూచించారు.

## ప్రభుత్వ పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలి



విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో ఎంఈఓకు వినతి పత్రం ఇస్తున్న దృశ్యం

**అమరచింత జూన్21, ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో మండల ఎంఈఓ కు శనివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పిడిఎస్ యు జిల్లా అధ్యక్షులు వెంకటేష్, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు టి రాఘవేంద్ర, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి, ఎండి కుతుబ్ మాట్లాడుతూ, అమరచింత మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకంలో విద్యార్థులకు వారానికి మూడు గుడ్లు ఇవ్వాలని నిబంధన ఉన్న మండలంలోని అన్ని పాఠశాలలో రెండు గుడ్లు మాత్రమే విద్యార్థి ఇస్తున్నారని మధ్యాహ్న భోజన వర్కర్లు బిల్లులు రాలేదని సాకుతో విద్యార్థులను మభ్యపెడుతున్నారని వారన్నారు. వెంటనే విద్యార్థులకు ప్రభుత్వం అమలు చేస్తున్న మెను ప్రకారం విద్యార్థులకు సరఫరా చేయాలని వారు డిమాండ్ చేశారు. అలాగే మండలంలో ప్రభుత్వ పాఠశాలలోమరుగుదొడ్లు, మూత్రశాలలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వెంటనే విద్యాధికారులు ఆయా పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలని విద్యార్థులకు మంచినీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని, విద్యార్థులకు క్రీడల సమయాన్ని కేటాయించాలని వారు కోరారు. అలాగే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్స్, యూనిఫామ్ సరఫరా చేయాలని వారు కోరారు. విద్యారంగ సమస్యలను పరిష్కరించకుంటే విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని వారు తెలిపారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ పేదల పాలిట వరం



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేస్తున్న దృశ్యం

**వెల్దండ, జూన్ 21 ప్రభాతవార్త:** అనారోగ్య బారినపడి ఆసుపత్రిలో చికిత్స పొందుటకు సీఎం రిలీఫ్ ఫండ్ పేదల పాలిట వరమని కల్వకుర్తి మార్కెట్ కమిటీ డైరెక్టర్ కేశమల్ల కృష్ణ అన్నారు. వెల్దండ మండలంలోని పెద్దాపూర్ గ్రామానికి చెందిన నెంట చరణ్‌కు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ రూ.90 వేల చెక్కును శనివారం కుటుంబ సభ్యులకు కేశమల్ల కృష్ణ సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందించారు. కార్యక్రమంలో లక్ష్మారెడ్డి, ఆంజనేయులు, శ్రీను, శివధనస్సు, అమరేందర్‌రెడ్డి, హజారుద్దీన్, సుధాకర్, తిరుపతి, అనిల్ కుమార్‌తో పాటు తదితరులున్నారు.

## నేడు విద్యుత్ అంతరాయం

**మక్తల్ టౌన్, జూన్ 21 ప్రభాతవార్త :** ఈ రోజు ఉదయం 7.30 నుండి 9.30 వరకు 132 కెవి సబ్ స్టేషన్ మక్తల్‌లో మరమ్మతులు నిర్వహించనున్నారు. మక్తల్, మాగనూరు, కృష్ణ ఉట్కూర్ మండల పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదు. కావున ఈ విషయంలో విద్యుత్ వినియోగదారులు, పట్టణ పరిసర ప్రాంతాల వాసులు ఇతర ప్రజలందరూ ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఏడీ ఇ మక్తల్ వారు ఓ అధికారిక ప్రకటనలో తెలియజేశారు.

# మహిళలు అని రంగాల్లో రాణించాలి

● వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్

**వనపర్తి, జూన్ 21 ప్రభాతవార్త :** మహిళలు అన్ని రంగాల్లో రాణించి ఆర్థికంగా ఎదగాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి పేర్కొన్నారు. శనివారం ఆర్డిఓ కార్యాలయ ప్రాంగణంలో మెప్మా ద్వారా మీనాక్షి మహిళా సంఘం క్యాంటీన్ ను జిల్లా కలెక్టర్ రిబ్బన్ కత్తిరించి ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళలు స్వయం ఉపాధి ద్వారా మహిళా సాధికారత సాధించేందుకు మహిళా శక్తి పథకం కింద ప్రభుత్వం ప్రోత్సాహం ఇస్తుందన్నారు. ఇందులో భాగంగానే క్యాంటీన్‌లు, పెట్రోల్ బంక్, సిమెంట్ ఇటుకల తయారీ, ఇతర వ్యాపారాలు చేసుకునేందుకు ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నారు. మహిళా సంఘాల సభ్యులు ప్రణాళికతో ముందుకు వచ్చి వ్యాపార రంగంలో రాణించాలని సూచించారు. ఈ ప్రారంభ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ జి వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, పిడి డిఆర్‌డిఓ ఉమాదేవి, మెప్మా డిఎంసి బాలరాజ్, మెప్మా సిబ్బంది మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ధన్వాడ కిస్టాపూర్‌కు బస్సు సౌకర్యం కల్పించాలి



డిఎంకు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

**ధన్వాడ, జూన్ 21 ప్రభాతవార్త:** బస్సు సౌకర్యం లేక ప్రభుత్వ పాఠశాల,జూనియర్ కళాశాలలో చదివే వందలాది మంది విద్యార్థులు, అధ్యాపకులు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేయాలని భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ డా. కె.రాజ్ కుమార్ రెడ్డి నారాయణపేట ఆర్టీసీ డిపో మేనేజర్ లావణ్యను శనివారం వారి కార్యాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. నారాయణపేట జిల్లా ధన్వాడ మండల పరిధిలోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాల, జూనియర్ కళాశాలను ఇటీవల భీష్మరాజ్ ఫౌండేషన్ సభ్యులతో కలిసి చైర్మన్ రాజ్ కుమార్ రెడ్డి సందర్శించారు. ఆదర్శ పాఠశాల, జూనియర్ కళాశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పాఠశాల, కళాశాల నిర్వాహకులు రాజ్ కుమార్ రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. అందులో భాగంగా పాఠశాల, జూనియర్ కళాశాలలో చదువుకుంటున్న వందలాది మంది విద్యార్థినీ, విద్యార్థులతో పాటు అధ్యాపకులు పాఠశాల, కళాశాలకు రావడానికి బస్సు సౌకర్యం లేక ఉదయం, సాయంత్ర సమయాల్లో ఇబ్బందులు పడుతున్నారని తమకు వివరించారని తెలిపారు. నారాయణపేట డిపో నుంచి ధన్వాడ మీదుగా కిస్టాపూర్ వరకు ఆర్టీసీ బస్సును నడపాలని కోరుతూ నారాయణపేట ఆర్టీసీ డిపో మేనేజర్ లావణ్యను వినతిపత్రం అందజేయడం జరిగిందని పేర్కొన్నారు. ఇక్కడ చదువుకునే విద్యార్థులు నారాయణపేట జిల్లాలోని పలు గ్రామాల నుంచి పాఠశాల, కళాశాలలో చదువుకునేందుకు వస్తున్నారని, బస్సు సౌకర్యం లేక వారు అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇక్కడ బస్సు సౌకర్యం లేక కొందరు విద్యార్థులు అడ్మిషన్లు వెనక్కి తీసుకొని వేరే ప్రాంతానికి తరలివెళ్తున్నారని వివరించారు. విద్యార్థుల సమస్యలను పరిగణనలోకి తీసుకొని బస్సు సౌకర్యాన్ని కల్పించాలని కోరారు. వినతిపత్రం సమర్పించిన వారిలో ఫౌండేషన్ సభ్యులు ఫౌండేషన్ సభ్యులు గడ్డం తిప్పన్న, మధుసూదన్‌రెడ్డి, హన్మంతు ముదిరాజ్, గోపాల్ గౌడ్, నర్సింహనాయుడు, ఎం.సంతోష్, వై.సంతోష్, కృష్ణ యాదవ్, శ్రీనివాస్, వెంకటరావు, రాజు తదితరులు ఉన్నారు.

# పాఠశాలలో మధ్యాహ్న భోజన కార్యక్రమం ప్రారంభం



విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న దృశ్యం

**శ్రీరంగాపూర్, జూన్ 21 ప్రభాతవార్త:** శ్రీరంగాపూర్ మండల్ కేంద్రంలోని నగరాల సెంటర్ 3 పాఠశాలలో శనివారం రోజు దాతల సహకారంతో మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని నగరాల సెంటర్ 3 పిఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయులైన కె.వెంకటస్వామి, ఇంచార్జ్ ఎన్. విష్ణువర్ధన్ నాయుడు ముఖ్య అతిథుల చేతుల మీదుగా ప్రారంభించారు. కార్యక్రమానికి సరిపడా వంట పాత్రలు, గ్యాస్ స్టవ్‌ని వినోబా రెడ్డి వితరణ చేశారు. ప్లేట్లు, గ్లాసులు, బియ్యం, వంట పదార్థాలను అస్కొ నీ కృష్ణ ప్రసాద్ వితరణ చేయగా లక్ష్మీనారాయణ, భాను చేతుల మీదుగా విద్యార్థులకు అందించారు. విద్యార్థులకు నోట్ బుక్స్‌ను, ఇన్చార్జి ఎన్.విష్ణువర్ధన్ నాయుడు సొంతంగా అందించారు. కార్యక్రమం అనంతరం పాఠశాల పరిసరాలలో చెట్లు నాటారు.

**అతి తక్కువ సమయంలో రాష్ట్ర స్థాయి గుర్తింపు రావడం అభినందనీయం: మండల విద్యాధికారి హనుమంతు**

విద్యాధికారి హనుమంతు మాట్లాడుతూ పాఠశాలను ఏర్పాటు చేసిన అతి తక్కువ సమయంలోనే రాష్ట్ర స్థాయి గుర్తింపు రావడం ఉపాధ్యాయుల పనితీరుకు నిదర్శనమని మండల విద్యాధికారి టి.హనుమంతు పేర్కొన్నారు. సృజనాత్మక పెయింటింగ్స్‌తో పాఠశాల గోడలను అందంగా తీర్చిదిద్దిన సెంటర్ ఇన్చార్జి విష్ణువర్ధన్ నాయుడు కృషిని ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో శ్రీరంగాపూర్ కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు నాగేంద్ర గౌడ్, మండల పరిషత్ అధికారి రాజు, పంచాయతీ సెక్రెటరీ యాదగిరి, గ్రామ పెద్దలు,ఉపాధ్యాయులు పి.శివ శంకర్ యాదవ్, వసంత పురం రాజు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## రైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి



కంసానిపల్లిలో రైతులకు స్ప్రింకర్ల పంపిణీ చేస్తున్న దృశ్యం

**ఉప్పునుంతల, జూన్ 21 ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో నే రైతు సంక్షేమానికి కృషి చేస్తుందని, రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యన్నారు. శనివారం మండలంలోని కంసాని పల్లి గ్రామంలో డ్రిప్పు సేద్యం పరికరాలను అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు పలువురు వేరు వేరు ప్రసంగంలో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి యనమల రేవంత్ రెడ్డి అందించిన సహకారాన్ని అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ ఆదేశాల మేరకు స్ప్రింక్లరను రైతులకుఅందజేయడం జరిగిందని పేర్కొన్నారు. ఈ పంపిణీ కార్యక్రమంలో ఆర్టికల్చర్ అధికారి చంద్రశేఖర్, నాగర్ కర్నూల్ జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మెంబర్ వెల్టూరి రేణయ్య, శ్రీ ఉమామహేశ్వర దేవస్థాన కమిటీ డైరెక్టర్ కట్ట శేఖర్ రెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు వెల్టూరి రామకృష్ణ, యూత్ కాంగ్రెస్ తాలూకా ఉపాధ్యక్షుడు మొగిలి మహేష్, మాగాణి భీమయ్య, కర్నె ఆంజనేయులు,కురుమయ్య, మల్లయ్య,కొట్టే శ్రీను, కొట్టే శ్రీనివాసులు, కల మండల తిరుమలయ్య, కొట్టే హరీష్, వెల్టూరి శ్రీకాంత్, కల మండల చిన్న నాగయ్య, కొట్టే సాయిబాబు, కర్నే లక్ష్మమ్మ, వెల్టూరు చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రపంచ సంగీత దినోత్సవం వేడుకలు

**నారాయణ పేట, జూన్ 21 ప్రభాతవార్త:** గంధర్వకళ సంగీతం కనుమరుగవుతున్న భారతీయ సాంప్రదాయకళలకు జీవం పోస్తున్నది బాలు అభిమాన సంఘమని సంగీతంలోమహో త్తరశక్తి దాగిఉందని చదువుతోపాటు చిన్నారులు తమకు నచ్చిన కళలు నేర్చుకోవాలని మాజీ మున్సిపల్ వైస్ చేర్మెన్, లయన్స్ క్లబ్ పాస్ట్ గవర్నర్ హరి నారాయణ్ బట్టడ్ జిల్లా సేవా భారతి ప్రతినిధి డా. మదన్ మోహన్ రెడ్డి అన్నారు శనివారం బాలకేంద్రంలో బాలు అభిమాన సంఘం రాష్ట్ర అధ్యక్షులుమహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రపంచ సంగీత దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.అంతకు ముందు వినాయక నటరాజ సరస్వతి మాత చిత్రపటాలతో పాటు సంగీత వాయిద్య పరికరాలకు పూజలు నిర్వహించి ప్రముఖ కూచిపూడి నృత్య కళాకారిణి డా. దిపిక ప్రసాద్ శెట్టి, సీనియర్ గాయకులు చంద్రశేఖర్ హార్మోని వాయిద్యకారుడు వసంత్ కుమార్‌లను ఘనంగా సత్కారించారు. అనంతరం విద్యార్థులకు నోట్ పుస్తకాలు పండ్లు పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ స్త్రీ వైద్య నిపుణురాలు గీత విశ్వనాథ్ డా. ప్రసాద్ శెట్టి ఎంవి,నాగరాజు, సంగ నర్సింహులు, వసంత్ కుమార్, జ్ఞానామృత తదితరులు పాల్గొన్నారు.



సంగీత దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

## పేదింటి విద్యార్థినికి ఆర్థిక చేయూత



ఆర్థిక సహాయం అందజేస్తున్న బిఆర్ఎస్ నాయకులు

**వనపర్తి, జూన్ 21 ప్రభాతవార్త :** కొత్త సుగూర్ (పెబ్బేరు మండలం) గ్రామానికి చెందిన బిఆర్ఎస్ కార్యకర్త జూదం రాజు ఇటీవల మరణించారు. రాజు కూతురు జూదం మానస తిరుమల నర్సింగ్ కలేజ్ (మిర్యాలగూడ) బిఎస్‌సి నర్సింగ్ కోర్సులో అడ్మిషన్ కావడం జరిగింది. మానసను చదివించే ఆర్థిక స్థోమత తమకు లేదని మానస తల్లి సునీత సహాయం చేయాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డిని కోరింది. వెంటనే స్పందించిన మాజీ మంత్రి తన కూతురు డా. సింగిరెడ్డి ప్రత్యూష దృష్టికి తీసుకురాగా వెంటనే స్పందించిన ప్రత్యూష మానస మొదటి సంవత్సరం కాలేజ్ ఫీజ్ 40000 కడతానని లండన్‌లో ఉన్న ఆమె డబ్బులు పంపించడంతో పార్టీ నాయకులు వారికి అందజేశారు. భవిష్యత్తులో మానస చదువుకు అండగా ఉంటానని డా..ప్రత్యూషా హామీ ఇచ్చారు. జూదం రాజు కుటుంబ సభ్యులు మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డికి, డా. సింగిరెడ్డి ప్రత్యూషకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమములో జిల్లా అధ్యక్షులు గట్టు యాదవ్, పెద్దింటి వెంకటేష్, పి.రమేష్ గౌడ్, నందిమల్ల అశోక్ పాల్గొన్నారు.

## డిగ్రీ కళాశాలకు మినీ ట్యాంకు బహుకరణ



కళాశాలకు మినీ ట్యాంక్ అందజేస్తున్న దృశ్యం

**మక్తల్ టౌన్, జూన్ 21 ప్రభాతవార్త:** మక్తల్ పట్టణ మున్సిపాలిటీలో క్రీడా మైదానంలో గల స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల నందు విద్యార్థుల సౌకర్యం కోసం త్రాగు మంచినీటి కొరకు దాతలు మన్నాని రాగమ్మ నారాయణ గార్ల జ్ఞాపకార్థం శ్రీమతి శ్రీ మన్నాని రుక్మిణి అంపయ్య వారి కుటుంబ సభ్యులచే మినీ ట్యాంక్ బహుకరించడం జరిగినది. ట్యాంక్ ప్రారంభకులు కట్టా సురేష్ కుమార్‌చే పూజ చేసి, కట్ట సురేష్‌తో పాటు మనసాని రాగమ్మ నారాయణ మనుమడు మనసాని నాగరాజు మినీ ట్యాంక్ ప్రారంభోత్సవం చేయడం జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ నారాయణ గౌడ్ మాట్లాడుతూ మా కళాశాల విద్యార్థులకు సౌకర్యంగా ఉండే మినీ ట్యాంకును బహుకరించినందుకు దాతలకు కృతజ్ఞతలు తెలిపి, దాతల మనుమడు మనసాని నాగరాజు, ప్రారంభకులు కాంగ్రెస్ నాయకులు కట్ట సురేష్ తో పాటు వచ్చిన వారికీ సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నారాయణ గౌడ్, బిలకంటి శ్రీనివాస్, కల్వాల కిషోర్, మనసాని కిరణ్, రంజిత్, మహేష్, తిమ్మన్న, లెక్చరర్లు, తదితరులు పాల్గొన్నారు.

## మత్తుతో జీవితం చిత్తు

**మక్తల్, జూన్ 21 ప్రభాతవార్త :** మత్తు పదార్థాల వినియోగంతో మానవుని జీవితం చిత్తవుతుందని, అందుకే విద్యార్థులు, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని మక్తల్ ఎస్సై వై. భాగ్యలక్ష్మి రెడ్డి అన్నారు. మక్తల్ పట్టణంలోని స్కాలర్స్ జూనియర్ కళాశాలలో శనివారం మత్తు పదార్థాల వల్ల జరిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన సదస్సును నిర్వహించారు. జూన్ 26న జరిగే డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ప్రజలకు వారంరోజుల పాటు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు.మత్తు పదార్థాల వినియోగంతో యువత తమ విచక్షణను కోల్పోయి దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ అంజిరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

## సాగునీరు పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులు

● బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎల్లారెడ్డి

**మాగనూర్,జూన్21 ప్రభాతవార్త:** మే నెలలోనే సమృద్ధిగా వర్షాలు కురిసి కృష్ణా నది పరవళ్ళు తొక్కుతుంటే అధికారుల నిర్లక్ష్యం వల్ల జూరాల నుండి వృధాగా దిగువకు నీటిని అధికారులు విడుదల చేస్తున్నారని మాగనూర్ మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఎల్లారెడ్డి మండిపడ్డారు. ఆయన మాట్లాడుతూ కృష్ణా నది పూర్తిస్థాయిలో ప్రవహిస్తున్నప్పుడు మక్తల్ నియోజకవర్గంలో ఉన్న నర్సిరెడ్డి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లోకి నీటిని తరలించడంలో ప్రజా ప్రభుత్వం విఫలమైందని అన్నారు. ప్రస్తుతం రైతులు నారుమళ్లు వేసుకునే సమయం కావడంతో రిజర్వాయర్లు సాగునీరు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు తెలిపారు. రైతుల పట్ల ప్రజా ప్రభుత్వానికి ఏమాత్రం ప్రేమ ఉన్న తక్షణమే బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు నది నుండి సాగునీరు తరలించి రైతులకు కాలువల ద్వారా సాగునీరు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## ఎమ్మెల్యే చేతుల మీదుగా విద్యార్థులకు బహుమతుల ప్రదానన

**నారాయణపేట టౌన్,టౌన్ 21 ప్రభాతవార్త:** 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా నారాయణపేటలోని వివిధ ఉన్నత పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు శనివారం సేవా భారతి మరియు పతంజలి యోగ సమితి ఆధ్వర్యంలో నేటి సమాజంలో యోగా ఆవశ్యకత అనే అంశంపై వ్యాసరచన పోటీ నిర్వహించారు. విజేతలైన 40 మంది విద్యార్థిని, విద్యార్థులకు ప్రథమ,ద్వితీయ బహుమతులకు అందజేశారు. కార్యక్రమానికి రాష్ట్ర సంఘటన కార్యదర్శి సుబ్రహ్మణ్యం మరియు పాలమూరు విభాగ కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్, పాలమూరు జిల్లా అధ్యక్షులు రాందేవ్ రెడ్డి, కార్యదర్శిడా. కృష్ణారెడ్డి,రామచంద్రయ్య అడ్వకేట్ పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసిన ఎంఈఓ

**దామరగిద్ద జూన్ 21 ప్రభాతవార్త:** మండలం పరిధిలోని అన్నాసాగర్ గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలను శనివారం రోజు మధ్యాహ్నం ఎంఈఓ కృష్ణారెడ్డి ఆకస్మికంగా సందర్శించి మధ్యాహ్న భోజనం పరిశీలించారు. పాఠశాలకు సంబంధించిన సమస్యలపై ఆరాతీశారు.అనంతరంవిద్యార్థులతో కలిసి భోజనం చేయడం జరిగింది. సిసీహెచ్‌లకు, ఏజెన్సీ వారికి మధ్యాహ్న భోజనం వండేటపుడు జాగ్రత్తలు తీసుకోవాలని, పరిశుభ్రత పాటించాలని సూచనలు చేయడంజరిగింది.కార్యక్రమంలో హెచ్ ఎం ఉసెనప్ప,ఉపాధ్యాయులుఅలి,తిరుపతిరెడ్డిలు ఉన్నారు.

## నూతనంగా ఎన్నికైన బిజేపి మండల కమిటీ కార్యవర్గ సభ్యులు

**నారాయణపేట ప్రతినిధి,జూన్ 21 ప్రభాతవార్త:** నారాయణపేట మండలానికి సంబంధించి శనివారం బిజేపి పార్టి మండల పూర్తి స్థాయి కమిటీని నూతనంగా 11 మంది పదాధికారులు, కార్యవర్గ సభ్యులని ప్రకటించడం జరిగింది. మండల అధ్యక్షురాలు జ్యోతి సాయిబణ, మండల ప్రభారీ మిర్చి వెంకటయ్య ఆధ్వర్యంలోరాష్ట్రకౌన్సిల్ మెంబర్‌వెంకట్రాములు కిసాన మోర్చా జిల్లా ప్రధానకార్యదర్శి బాల్ రెడ్డి, మాజీ అధ్యక్షులు సాయిబన్న ఆధ్వర్యంలో నూతనంగాఎన్నికైన వారి పేర్లు ప్రకటి స్తూ మండలం ఉపాధ్యక్షులుగా జల్లాలపూర్ శివప్ప,ఆర్ ప్రభా కర్, భీంసేన్‌జోషి, కె.చెన్నమ్మ ప్రధాన కార్యదర్శులుగా శ్రీనివాస్ గణప,సాక ప్రవీణ్ కుమార్‌కార్యదర్శులుగా మంగలి రవికుమార్, హన్మమ్మ, శ్రీనివాస్, పిల్లి ఉషారాణి కోశాధికారిగా జి.ప్రభాకర్ రెడ్డితోపాటుమిగితా మండల కార్యవర్గ సభ్యులను ప్రకటించారు.

## అనారోగ్యానికి గురైన చిన్న జంగిరెడ్డిని పరామర్శించిన ఎమ్మెల్యే

**ఉప్పునుంతల, జూన్ 21 ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఉప్పునుంతల గ్రామానికి చెందిన కొత్త యశోద ఫంక్షన్ హాల్ ప్రొ॥ కొత్త చిన్న జంగి రెడ్డి అనారోగ్యానికి గురి కావడంతో శనివారం సాయంత్రం టిపిసిసి ఉపాధ్యక్షుడు, నాగర్ కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు,అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ పరామర్శించారు. హైదరాబాదులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండడంతో ఆస్పత్రికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య పరిస్థితి ఎలా ఉందని ఆసుపత్రి సిబ్బంది అడిగి తెలుసుకున్నారు. ఆయనతోపాటు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కట్ట అనంతరెడ్డి, తిప్పర్తి నరసింహారెడ్డి, కొత్త పెద్ద జంగిరెడ్డి, సూరం నారాయణరెడ్డి, మద్దు శ్రీనివాస్‌రెడ్డి, ఏమిరెడ్డి రాంరెడ్డి, సూరం ప్రశాంత్ రెడ్డి, కట్ట వీరారెడ్డి, కుటుంబ సభ్యులు ఉన్నారు.

## యోగాతో క్రమశిక్షణ, ఏకాగ్రత

జిల్లా విద్యాశాఖ అధికారి ప్రవీణ్ కుమార్

**మహబూబ్‌నగర్, జూన్ 21 ప్రభాతవార్త:** ప్రతిరోజు యోగా చేయడం వలన విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఏకాగ్రత పెరుగుతుందని, కనీసం రోజుకు 30 నిమిషాలు యోగా చేయడం అలవాటు చేసుకోవాలని డీఈవో ప్రవీణ్ కుమార్ విద్యార్థులకు సూచించారు. అంతర్జాతీయ యోగ దినోత్సవం సందర్భంగా మహబూబ్‌నగర్ పట్టణంలోని వెంకటేశ్వర కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో సీఎంవో బాలుయాదవ్, మండల విద్యాశాఖ అధికారి లక్ష్మణ్‌సింగ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఇతర ఉపాధ్యాయుల సమక్షంలో యోగాసనాలు చేశారు. ఈ సందర్భంగా ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ధ్యానం చేయడం వలన ఉపాధ్యాయులకు మానసిక ఒత్తిడి తగ్గి, ఉద్యోగ బాధ్యతలు మరింత సమర్థవంతంగా నిర్వహించగలగడం సాధ్యమవుతుంది" అని వివరించారు. నాణ్యమైన విద్య ప్రభుత్వ పాఠశాలలోనే లభిస్తుందని పేర్కొన్నారు.ఇటీవల ప్రైవేట్ పాఠశాలల నుంచి ఈ పాఠశాలలో చేరిన విద్యార్థులను అభినందిస్తూ, వారిని చేర్పించిన ఉపాధ్యాయ బృందానికి ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు.



ప్రైవేట్ నుంచి ప్రభుత్వ పాఠశాలలో చేరిన విద్యార్థులను అభినందిస్తున్న డీఈవో ప్రవీణ్ కుమార్

# ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం






యోగాసనంలో విసి, విద్యార్థులు



యోగా చేస్తున్న ఎస్పీ



యోగాసనాలు వేస్తున్న జిల్లా పోలీసు యంత్రాంగం

- **యోగాను పరిచయం చేసింది భారతదేశము**
- **ఉపకులపతి ఆచార్య జిఎన్ శ్రీనివాస్**

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూన్ 21 ప్రభాతవార్త:** ప్రపంచానికి యోగాను పరిచయం చేసింది భారతదేశమని పాలమూరు విశ్వవిద్యాలయ వైస్ ఛాన్స్‌లర్ శ్రీనివాస్ అన్నారు. పాలమూరు యూనివర్సిటీలో లైబ్రరీ పరిసర ప్రాంతాలలో ఎన్ఎస్ఎస్ సెల్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్స వం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా ఉపకులపతి ఆచార్య జీవి శ్రీనివాస్ హాజరై ప్రసంగిస్తూ శరీరాన్ని మనసును ఏకం చేసే అద్భుత సాధనం యోగా అని యోగా మరియు మెడిటేషన్ ద్వారా శరీరంలో ప్రతి కణం ఉత్తేజమవుతుందని, తద్వారా రక్తప్రసరణ అన్ని భాగాలకు జరిగి మానవులు ఆరోగ్యంగా ఉంటారని, రోజువారి కార్యక్రమాలలో బిజీ జీవితాన్ని గడుపుతున్న వారికి యోగా మెడిటేషన్ ద్వారా ఉపశమనం లభిస్తుందన్నారు. అనంతరం వీసీ కనిష్ట, మధ్యమ, జేష్ట ప్రాణయమాలు చేయించారు. రిసోర్స్ పర్సన్ డా.చంద్ర కిరణ్ మాటా ్లడుతూ 192 దేశాలు ఏకగ్రీవంగా జూన్ 21ని అంతర్జాతీయ యోగా దినోత్సవంగా ఆమోదించాయని, ఇది భారతీయులందరికీ గర్వకారణమని, సూక్ష్మవ్యాయమాలు చెయ్యడం ద్వారా శరీరాన్ని యోగాకు అనుకూలంగా మలుచుకోవచ్చని, సూర్య నమస్కారాల ద్వారా శరీరంలోని అన్ని భాగాలు వృక్షాసనం ద్వారా ఏకాగ్రత పెరుగుతుందని, త్రికోణాసనం ద్వారా నడుము భాగంలో ఉన్న చెడు కొవ్వు కరుగుతుందని, నౌకాసనం ద్వారా ఉదరం కండరాలుబలపడతాయని, సేతు బంధు ఆసనం ద్వారా వెన్ను నొప్పి తగ్గు తుందని, శ్వాస మీద ధ్యాస పెట్టడమే ధ్యానమని, ధ్యానం ద్వారా ఉచ్ఛ స్థితిలోకి చేరుకోవచ్చునని అన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ పూస రమేష్ బాబు, పరీక్షల నియంత్రణ అధికారి కోఆర్డినేటర్ డా.కె. ప్రవీణ, ప్రిన్సి పాల్స్ డా.రవికాంత్, డా.కర్ణాకర్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డా. కృష్ణయ్య, ప్రోగ్రాం అధికారులు డా.రవికుమార్ ,డా.అజయ్ కుమార్, డా.గాలన్న, డా. ఈశ్వర్ కుమార్, డా. చిన్నాదేవి, డా. శివకుమార్ సింగ్, డా. జ్ఞానేశ్వర్ వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, అధ్యాపకేతరులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్ అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

**నారాయణపేట ప్రతినిధి, జూన్21 ప్రభాతవార్త :** ప్రపంచ 11వ అంతర్జా తీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని శనివారం ఉదయం స్థానిక జిల్లా పోలీస్ పరేడ్ మైదానం నందు ఏర్పాటు చేసిన యోగా దినోత్సవ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ పాల్గొని సిబ్బందితో కలిసి యోగా నిర్వహించారు. మొదటగా యోగా శిక్షకుడు కుమ్మరి నర్సింలు యోగను సిబ్బందికి తెలియజేస్తూ, సూర్య నమస్కారాలు, ప్రాణాయా మము, ఆసనములు చేయించడం జరిగింది. యోగా దినోత్సవంలో భాగంగా జిల్లా ఎస్పీతో సహా సిబ్బంది అందరూ వివిధ రకాల ఆసనములు, ప్రాణాయాములు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మొదటగా సిబ్బందికి పదకొండవ అంతర్జాతీయ యోగా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ, భారతదేశంలో యోగా పుట్టడం మన అందరి అదృష్టంగా పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా ప్రజలు అన్ని డిపార్ట్మెంట్లు ఈ రోజు యోగా దినోత్సవం జరుపుకోవడం జరుగుతుందన్నారు. యోగ అనేది వయస్సుకు సంబంధంలేకుండా అందరూ చేసే ఒక సాధనమని పేర్కొం టూ, యోగా వల్ల,ఆసనాల వల్ల అనారోగ్య బారిన పడకుండా, శారీరక దృఢత్వాన్ని కాపాడుతూ ఉండవచ్చని పేర్కొన్నారు. ముఖ్యంగా పోలీసులు రేయింబవళ్ల 24 గంటలు విధులను నిర్వర్తిస్తుంటారని పోలీసులు ఒత్తిడిని తట్టుకోవడానికి ప్రతిరోజు యోగ, ధ్యానం సమయం దొరికినప్పుడు చేస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ విధులను నిర్వర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి ఎండి రియాజ్ హూల్ హక్, డీఎస్పీలు ఎన్ లింగయ్య, మహేష్,ఆర్ఐ నరసింహ, సిఐ శివ శంకర్, ఎస్ఐ వెంకటేశ్వర్లు, ఆర్ఎస్ఐలు శివశంకర్, ఇందిర, పేట సర్కిల్ పోలీసులు, ఆర్మ్డు రిజర్వ్ పోలీసులు, తదితరులు పాల్గొన్నారు.

**కల్వకుర్తి, జూన్ 21 ప్రభాతవార్త:** అంతర్జాతీయ యోగా దినోత్సవం సంద ర్భంగా కల్వకుర్తి కోర్టు ఆవరణలో శనివారం యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి ఏ.శ్రీదేవి, జూనియర్ సివిల్ జడ్జి జె.కావ్యలు యోగడేలో ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ సందర్భం గా వారు మాట్లాడుతూ యోగా అవసరాన్ని వివరించారు. అన్ని వయసుల వారికి యోగ అవసరమన్నారు. ప్రతి మనిషి శారీరకంగా మానసికంగా దృఢంగా ఉండాలంటే ప్రతి రోజుయోగా చేయడం ఎంతో అవసరం అన్నారు .యోగ ప్రాధాన్యత గుర్తించి ప్రపంచంలోని చాలా దేశాలు యోగాను అనుసరిస్తున్నారని అన్నారు. యోగ గురువు ఆంజనేయులు ఆధ్వర్యంలో వినూత్నమైన యోగాసనాలు వేయించారు. ఈ కార్యక్రమంలో ఏజీపీలు వెంకటరెడ్డి, లక్ష్మణ్ రాజ్, న్యాయవాదులు బృంగి అమరేందర్, భాస్కర్ రెడ్డి, జమీల్ అహ్మద్, జయంత్‌కుమార్, శివకుమార్, శ్రీను, సివిల్ కోర్ట్ సూపరిడెంట్‌ఆనంద్,సిబ్బంది చంద్రశేఖర్,స్వరూప,అనిల్, శ్రీలత, డి.శ్రీలత, పి.శ్రీలత, జూనియర్ కోర్ట్ సివిల్ సూపరిండెంట్ సత్యం, సిబ్బంది పార్వతమ్మ, స్వామి, రాజేంద్రప్రసాద్, దినేష్, శంకర్, పారిజాత, దేవి, మోనిక, మాధవి తదితరులు యోగాడేలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

**వనపర్తి క్రైమ్, జూన్ 21 ప్రభాతవార్త :** ప్రపంచ పదకొండవ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శనివారం రోజు వనపర్తి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ఆదేశాల మేరకు వనపర్తి జిల్లా పోలీసు కార్యాలయం పరేడ్ మైదానంలో సాయుధ దళ రిజర్వ్ ఇన్స్పెక్టర్, అప్పలనాయుడు ఆధ్వర్యం లో యోగా కార్యక్రమం ఏర్పాటు చేశారు. మొదటగా యోగా శిక్షకుడు కానిస్టేబుల్ రాజశేఖర్ యోగను సిబ్బందికి తెలియజేస్తూ, సూర్య నమస్కా రాలు, ప్రాణాయామము, ఆసనములు సిబ్బంది ద్వారా చేయించారు. జిల్లా పోలీసు అధికారులు సిబ్బంది అందరూ వివిధ రకాల సూర్య నమస్కా రాలు, ఆసనములు, వివిధ రకాల ప్రాణాయాములు స్వయంగా చేశారు. ఈ సందర్భంగా రిజర్వ్ ఇన్స్‌పెక్టర్ మాట్లాడుతూ మొదటగా సిబ్బందికి పదకొండవ అంతర్జాతీయ యోగా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆధునిక సమాజపు పోకడలకు లొంగిపోయి, అనారోగ్యంతో కునారిల్లుతున్న మనిషికి యోగా ప్రకృతిసిద్ధమైన శక్తిని అందిస్తుందని అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఈరోజు యోగా దినోత్సవం జరుపుకోవడం జరుగుతుందన్నారు. అతి చిన్న వయసులోనే రోగాలకు గురవుతూ ప్రమాద పరిస్థితులు నెలకొంటున్న నేటి పరిస్థితుల్లో యోగా, సూర్య నమస్కారాలు, నడక వంటివి మన దినచర్యలో భాగంగా చేసుకోవాలని సూచించారు. యోగ అనేది వయసుకు సంబంధం లేకుండా అందరూ చేసే ఒక సాధనమని పేర్కొంటూ, యోగా వల్ల, ఆసనాల వల్ల అనారోగ్య బారిన పడకుండా, శారీరక దృఢత్వాన్ని కాపాడుకో వచ్చని పేర్కొన్నారు. ముఖ్యంగా పోలీసులు రేయింబవళ్లు 24 గంటలు విధులను నిర్వర్తిస్తుంటారని వారికి యోగ ఎంతగానో తోడ్పాటు అందజేస్తుందని, ఆరోగ్యాన్ని కాపాడుతూ విధులను నిర్వర్తించాలని సూచించారు. యోగ ప్రాణాయామము ఆసనాలు వలన మానసిక, శరీరక విశ్రాంతి, ఉపశమనం లభించి ప్రశాంతత లభిస్తుందని తెలిపారు.గుండెకు, శరీరానికి, మనసుకు అన్నిటికీ యోగ ఉత్తమమైన మార్గమని తెలిపారు. ఈరోజు జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని పోలీసు పోలీస్టేషనలలోఅధికారులు, సిబ్బంది యోగా దినోత్సవం నిర్వహించు కోవడం జరిగిందని తెలిపారు. పోలీసు అధికారులు, సిబ్బంది యోగాను దైనందిన జీవితంలో ఒక భాగంగా మార్చుకోవడం ద్వారా ఆనందకర జీవితాన్ని పొందగలరని అన్నారు. ప్రతి ఒక్కరూ ప్రతి రోజూ అరగంట, గంట పాటు యోగా చేస్తే చాలా వరకూ అనారోగ్యం పాలుకాకుండా ఒత్తిడి వంటివి లేకుండా ప్రశాంత జీవనం సొంతం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రిజర్వ్ ఇన్స్పెక్టర్లు, అప్పలనాయుడు,శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచ్ సీఐ, నరేష్, బిసిఆర్బి ఎస్సై తిరుపతిరెడ్డి, రిజర్వ్ సబ్ ఇన్స్పెక్టర్లు, వినోద్, మగ్దంభారీ, జిల్లాలోని పోలీసు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

**దామరగిద్ద, జూన్ 21 ప్రభాతవార్త :** అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా దామరగిద్ద మండల కేంద్రంలో పతంజలి యోగా సమితి పతాంజలి యోగాసన జిల్లా అధ్యక్షులు ఎం.అశోక్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవంను స్థానిక రెయిన్ బో స్కూల్ లో శనివారం రోజు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యోగ మానసిక ఉల్లాసాన్ని ప్రశాంతతను కలిగిస్తాయని అన్నారు. మనం ప్రతిరోజు యోగ చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాటరని తెలియజేశారు. ఇట్టి కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ పుట్టి ఈదప్ప, బిజెపి సీనియర్ నాయకులు గోపాలరావు,బసిరెడ్డి,మోహన్ రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, రఘు, ఆరోగ్యాభిలాషులు తదితరులు పాల్గొన్నారు.

**ధన్వాడ, జూన్ 21 ప్రభాతవార్త :** ధన్వాడ మండలం కేంద్రంలో యోగ సాధన విజయవంతంగా పూర్తి చేసిన గ్రామస్తులు యువత రోజు యోగ సాధనాలు చేస్తే ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని యోగా అనేక శారీరక మరియు మానసిక ప్రయోజనాలను అందిస్తుంది. క్రమం తప్పకుండా యోగాభ్యాసం చేయడం వల్లబలం మరియు సమతుల్యత మెరుగుపడ తాయి, అదే సమయంలో ఒత్తిడిని తగ్గించి మానసిక స్పష్టతను పెంపొంది స్తాయి. అదనంగా, యోగా శ్వాసకోశ పనితీరును మెరుగుపరుస్తుంది, నిద్ర నాణ్యతను మెరుగుపరుస్తుంది మరియు శక్తి స్థాయిలను పెంచుతుంది. అని రాష్ట్ర స్వయం సేవక్ సంఘ శాఖ వారు తెలియపరిచారు. అలాగే ప్రతి రోజూ ఉదయం 5 గం.ల నుంచి 7:30 వరకు యోగ సాధనాలు చేస్తామని భోగం బాలయ్య తెలిపారు. కార్యక్రమంలో శిక్షణ నిర్వాహకులు శ్రీహరి, కెంచే జయప్రకాష్, సుంకు ఉమేష్, మకాం సురేందర్, కాశప్ప, జుట్రం గోపి, పి.రామచంద్రయ్య, ద్యావరీ మల్లేష్ గౌడ్, నీరటి నారాయణ, జడల బాలరాజ్, యువకులు తదితరులు పాల్గొన్నారు.

**భూత్పూర్,జూన్ 21,ప్రభాతవార్త:** ప్రపంచ యోగ దినోత్సవాన్ని భూత్పూర్ పట్టణ కేంద్రంలోని యునాని,పీహెచ్‌సీ వైద్యశాలలో శనివారం ఘనంగా నిర్వహించారు.యునాని వైద్యులు డాక్టర్ జహీరొద్దిన్,పీహెచ్‌సీ ఎంఓ డాక్టర్ మొహ్మద్ అబ్దుల్ రబ్‌ల ఆధ్వర్యంలో ఆసుపత్రి ఉద్యోగులు ,సిబ్బంధి, యువకులు,విద్యార్థులు యోగలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా యోగ విశిష్టతను యునాని వైద్యులు డాక్టర్ జహిరొద్దిన్,పీహెచ్‌సీ ఎంఓ డాక్టర్ మొహ్మద్ అబ్దుల్ రబ్‌లు వివరించారు.ఈ కార్యక్రమంలో స్టాఫ్ నర్స్ స్వాతి,హెల్త్ సూపర్‌వైజర్లు సుధాకర్,భాగ్యలక్ష్మి,,హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్ తదితరులు యోగలో పాల్గొని యోగ విశిష్టతను తెలియజేశారు.

**బిజినపల్లి, జూన్ 21 ప్రభాతవార్త:** నిత్యం యోగా చేయడం అలవాటు చేసుకోవాలని మనతోపాటు మన పిల్లలకు సైతం యోగాను నేర్పించాలని మాజీ ఎంపీపీ శ్రీనివాస్ గౌడ్ సూచించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో అంతర్జాతీయ యోగా దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. నవోదయ పాఠశాలలో వ్యాయామ శిక్షకులు సత్యజ్యోతి, పర్వేశ్ మదన్ ఆధ్వర్యంలో దాదాపు 500 మంది విద్యార్థులు పలు యోగ విన్యాసాలు ప్రదర్శించారు. పలువురు మాట్లాడుతూ మానసిక శారీరక ఒత్తిళ్లను యోగా దూరం చేస్తుందనే విషయాన్ని ప్రతి ఒక్కరు గుర్తించాలని చెప్పారు. యోగాతో శారీరక, మానసిక ప్రశాంతత దొరుకుతుందన్నారు.

**చిన్నచింతకుంట, జూన్ 21 ప్రభాతవార్త:** అంతర్జాతీయ యోగ దినోత్సవం పురస్కరించుకొని మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాలలో శనివారం ప్రభుత్వ పాఠశాలల్లో, కస్తూర్బా గాంధీ, ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో యోగ దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రంలో జడ్పీ ఉన్నత పాఠశాలలో మైదానంలో ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని యోగ ఆసనాలను వేశారు ప్రతిరోజు యోగ చేయడం వల్ల మానసిక ఒత్తిడిని దూరం చేస్తూ సంపూర్ణ ఆరోగ్యవంతులుగా జీవించవచ్చని బిజెపి నాయకులు నంబి రాజు, కురువ రమేష్, దశరథ్‌లు అన్నారు. దేశ ప్రధాని నరేంద్ర మోడీ యోగను ప్రపంచానికి పరిచయం చేసి నేడు ప్రపంచ దేశాలలో యోగను ఆచరించేలా చేశారన్నారు. ప్రపంచంలోని అన్ని దేశాలలో చిన్నారుల నుంచి వృద్ధుల వరకు యోగాను ఆచరిస్తున్నారంటే అది మోది ఘనతే అన్నారు. అనంతరం చిన్నారులతో కలిసి యోగాసనాలను చేశారు. కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో, ఆయా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా పాఠశాల మైదానంలో యోగాసనాలు వేశారు. తనువు, ఆత్మ, మనసును ఏకం చేసే సాధనే యోగాని అలాంటి యోగాను ప్రతి ఒక్కరూ రోజు ఉదయాన్నే ఆచరించి మానసిక ఒత్తిడిని దూరం చేసుకుని ఆరోగ్యవంతులుగా జీవించాలని ఎంఈఓ మురళి కృష్ణ అన్నారు.

**ఉప్పునుంతల, జూన్21 ప్రభాతవార్త:** అంతర్జాతీయ యోగా దే మండలంలో శనివారం ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రమైన ఉప్పునుంతల ప్రాథమిక బాలుర పాఠశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో, మండలంలోని కంసాని పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో యోగా డే దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. సూర్య నమస్కారాల తో విద్యార్థిని విద్యార్థులు యోగ కార్యక్రమంలో పాల్గొన్నారు. అదేవిధంగా స్థానిక పిఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో విద్యార్థులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, ప్రాథమిక వైద్య అధికారిని డా. స్వప్న, హోమియోపతి వైద్య అధికారిని శివలీల, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

**వనపర్తి రూరల్, జూన్ 21 ప్రభాతవార్త :** సనాతన భారతీయ ధర్మం ప్రపంచానికి అందించిన గొప్ప వరం యోగా అని బిజెపి జిల్లా అధ్యక్షులు డి నారాయణ అన్నారు. శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా యోగ డే కార్యక్రమం జిల్లా కన్వీనర్ మెంటేపల్లి పురుషోత్తం రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ లలిత కళాతోరణంలో యోగా వేడుకల్లో భాగంగా యోగా గురువు ఓంకార్‌చే యోగాసనాలు వేయించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బిజెపి జిల్లా అధ్యక్షులు డి.నారాయణ మాట్లాడుతూ యోగా మన దేశ పురాతన సంస్కృతి సంప్రదాయాలలో భాగమని, శారీరక, మానసిక ప్రశాంతత కొరకు ప్రతి ఒక్కరూ యోగా అలవాటు చేసుకోవాలని ప్రతి ఒక్కరు తమ తమ దిన చర్యలో భాగంగా యోగాను అలవార్చుకోవాలని, ఈ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా ప్రజలు స్థూలకాయ సమస్యను ఎదుర్కోవడానికి మన ఆహారంలో నుండి 10 శాతం నూనె తగ్గించాలని, వంట నూనె శాతం తగ్గించడము, యోగా చేయడం వలన మన జీవితాలు ఆరోగ్యంగా మారతాయని తెలియజేశారు. ప్రధాని నరేంద్ర మోడీ కృషి ఫలితంగా 2014లో ఐక్యరాజ్యసమితి జూన్ 21ని అంతర్జాతీయ యోగా దినోత్సవంగా చేయడానికి నిర్ణయం తీసుకోవడం ద్వారా భారతదేశం గొప్ప విజయాన్ని సాధించిందని, ప్రపంచంలోని 195 దేశాలలో యోగా దినోత్సవాన్ని అధికారికంగా జరుపుతున్నారని, ప్రపంచంలో విభిన్న వర్గాలు, విభిన్న జాతులు, విభిన్న సంస్కృతులను, విభిన్న మతాలకు అతీతంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం జరుపుకుంటున్నారని ఇది భారతదేశానికి గొప్ప గర్వకారణం అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు డి నారాయణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సబిరెడ్డి వెంకటరెడ్డి, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ ఆర్.లోకనాథ్ రెడ్డి, సర్పంచుల సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షులు పురుషోత్తం రెడ్డి, యోగ సాధకులు జిజే శ్రీనివాసులు, పుల్లారావు, రామన్ గౌడ్, భాశెట్టి శీను, కుమారస్వామి, సుమిత్రమ్మ, వెంకటేశ్వర రెడ్డి, పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

**మక్తల్ టౌన్, జూన్ 21 ప్రభాతవార్త:** అంతర్జాతీయ జాతీయ యోగ దినాన్ని పురస్కరించుకొని పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొని యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. యోగ చేయడం వల్ల మానసిక ఉల్లాసం శారీరక శ్రమ మరియు ఆరోగ్యం ఇతర రోగాలకు సర్వరోగ నివారిణిగా యోగ ఉపయోగపడుతుందని , యోగా క్రమం తప్ప కుండా చేయడం వల్ల ఏ రోగాల బారిన పడకుండా నేటి సమాజంలో యోగా అతి ప్రాముఖ్యమైనది. యోగా ప్రతిరోజు చేసిన వారికి నేటికీ సాక్షా దారులతో సహా ఇలాంటి రోగాలు రాకుండా వ్యాధి నిరోధక శక్తిని పెంచుకొని ఉత్సాహంగా ఉంటున్నారు. వయసుతో సంబంధం లేకుండా ఆయురా రోగ్యాలతో కాలం వెళ్లదీస్తున్నారని నిపుణులు తెలియజేస్తున్నారు. మక్తల్ పట్టణంలో వివిధ ప్రాంతాలలో రాజకీయ నాయకులు విద్యావేత్తలు సామా జిక కార్యకర్తలు వ్యాపారవేత్తలు శ్రీ సత్యసాయి దేవాలయంలో అన్ని పాఠశాలలలో యోగ దినాన్ని ఘనంగా నిర్వహించారు.

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూన్ 21 ప్రభాతవార్త:** యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని, ప్రతి ఒక్కరు యోగాసానాలు చేయడంతో శరీరానికి ఎంతో మేలు చేకూరుతుందని పంచాయతీ కార్యదర్శి మూడావత్ పద్మ అన్నారు.నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గంలోని పదర మండలం చెన్నంపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో అంతర్జా తీయ యోగా దినోత్సవ కార్యక్రమాన్ని పంచాయతీ కార్యదర్శి మూడావత్ పద్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి మాట్లాడుతూ యోగాను నిత్య జీవితంలో భాగం చేసుకోవాలని, రోజూ యోగా చేయడం ద్వారా ఆరోగ్యంగా ఉంటామన్నారు. యోగాలో భాగమైన ధ్యానం, ఆసనాలు, ప్రాణాయామం వంటివి ఆచరించడం ద్వారా మానసిక ప్రశాంతతో పాటు శారీరక ఆరోగ్యం కూడా లభిస్తుందని గుర్తించిన అంతర్జాతీయ సమాజం జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవంగా నిర్వహించుకోవడం భారతీయులందరికి గర్వకారణమన్నారు. అంతకు ముందు గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో గ్రామస్తులు, చిన్నారులతో కలిసి యోగా చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు మల్లేష్, అంగన్‌వాడీ టీచర్ పార్వతమ్మ, ఆశా వర్కర్ స్వప్న, సంధ్యారాణి, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**రాజాపూర్, జూన్ 21 ప్రభాతవార్త :** రాజాపూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని పలు పార్టీల నాయకులు, కార్యకర్తలు, యువకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు యోగ ఆసనాలు వేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ యోగా చేయడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని,యోగాకు సంబంధించిన పలు ఆసనాలను విద్యార్థు చే చేయించారు. యోగా చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో పలు పార్టీల నాయకులు, కార్యకర్తలు, యువకులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**పెబ్బేరు, జూన్ 21 ప్రభాతవార్త :** పెబ్బేర్ మున్సిపల్ కేంద్రంలో బిజెపి మున్సిపల్ క్రీడా ప్రాంగణం నందు శనివారం రోజు అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా పట్టణ ప్రముఖులు, వాకర్స్, విద్యార్థులు పాల్గొని దినోత్సవంలో పలు రకాల ఆసనాలు చేసి యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రతిరోజు యోగా చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని యోగాతో గుండె సమస్యలు, కిడ్నీ సమస్యలు పలు రకాల ఆరోగ్య సమస్యలను నివారించవచ్చని పలువురు వక్తలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గొడుగు శాంతన్న, చిన్న రాములు, డా. పవన్ కుమార్ ,నాగరాజు, ఎద్దుల సాయినాథ్, రవికుమార్ శెట్టి, ఈశ్వరయ్య, సుధాకర్, పట్టణ ప్రముఖులు వ్యాపారవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

**ఇటిక్యాల, జూన్ 21 ప్రభాతవార్త :** ప్రపంచ యోగా డేను పురస్కరించుకొని శనివారం యజ్ఞంలా ఉమ్మడి మండలంలోని గ్రామాలలో అధికారులు, యువత, విద్యార్థులు, ఉపాధ్యాయులు యోగా డేలో పాల్గొని వివిధ యోగాసనాలు నిర్వహించారు.మండల పరిధిలో గల పదవ బెటాలియన్‌లో కమాండెంట్ జయరాజ్ ఆధ్వర్యంలో పోలీస్ అధికారులు, పోలీస్ సిబ్బంది ఆధ్వర్యంలో యోగ డే సందర్భంగా పరేడ్ గ్రౌండ్‌లో పలు యోగాసనాలు నిర్వహించారు. అలాగే ఇటిక్యాల మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఇంచార్జ్ ప్రిన్సిపల్ మమత, మెడికల్ ఆఫీసర్ రాధిక, యునాని ఆయుర్వేద డా. ముబీనా తబస్సుమ్, ఎంపీడీవో మహమ్మద్ అజార్ మోహియుద్దీన్, ఎంఈఓ వెంకటేశ్వర్లు, గురుకుల ఉపాధ్యాయులు వైద్య సిబ్బంది విద్యార్థులతో కలిసి యోగాడేలో యోగాసనాలు చేపట్టారు. సాతర్ల గ్రామంలో మండల బిజెపి పార్టీ అధ్యక్షులు అబ్దుల్లా, పంచాయతీ కార్యదర్శి వెంకటనారాయణ ఆధ్వర్యంలో ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిసి యోగా డేను జరుపుకున్నారు. అంతేకాక ఎర్రవల్లి చౌరస్తాలో గల సరస్వతి టెక్నో పాఠశాల, ఏకశిలా పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థులు విద్యార్థినిలతో కలసి యోగా డే సందర్భంగా యోగాసనాలు నిర్వహించారు. ప్రపంచ యోగా డేను పురస్కరించుకొని మండలంలోని ఊరు రా ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, యువత, ఔత్సాహికులు కలిసి యోగ డే సందర్భంగా యోగాసనాలు నిర్వహిస్తూ యజ్ఞంలా కొనసాగిన యోగా డేలో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




























## ఉచిత నోట్ పుస్తకాల పంపిణీ



పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

**నాగర్ కర్నూల్, జూన్ 21 ప్రభాతవార్త:** తిమ్మాజీపేట మండలం ఆవంచ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో కేంద్ర ప్రాథమిక పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యా స్వేచ్ఛ ఫౌండేషన్, యువ జాగృతి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఒక్కో పాఠశాలకు రూ.20వేల విలువగల నోట్ బుక్స్ పెన్సిల్స్, పెన్నులు విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి విద్యా స్వేచ్ఛ ఫౌండేషన్ చైర్మన్ వాసుదేవరావు, జోసఫ్ రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న గ్రామీణ ప్రాంత విద్యార్థులను ప్రోత్సాహించడం కోసం, ప్రతిభను వెలికితీయడానికి కృషి చేస్తూ సర్కార్ బడి పిల్లల అభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నాం అని తెలిపారు. దాదాపు 250 మంది విద్యార్థిని, విద్యార్థులకు నలభై వేల రూపాయల విలువగల నోట్ బుక్స్ అందజేయడంతో వారికి ఎంతో మేలు జరుగుతుందని తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో యువ జాగృతి ఫౌండేషన్ వ్యవస్థాపకులు మధు సూదన్ రెడ్డి, భాస్కరారెడ్డి, బాలస్వామి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి వారికి అర్హత కలిగిన అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే విద్యార్థులకు విద్య అందించాలని దృఢ సంకల్పంతో విద్యా స్వేచ్ఛ ఫౌండేషన్ వారితో కలిసి పనిచేస్తున్నామని నేటి బాలలే రేపటి భావి భారత పౌరులని వారి బంగారు భవిష్యత్తుకు ఎల్లవేళలా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తిమ్మాజీపేట్ మండల విద్యాధికారి సత్యనారాయణ శెట్టి, తిమ్మాజీపేట్ మండలం సీపీఎస్ జీపీఎస్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు,ప్రశాంత్ కుమార్, రాములు, ఉపాధ్యాయ బృందం ఉన్నారు.

## సీతా దయాకర్ రెడ్డికి సన్మానం



సీతా దయాకర్ రెడ్డిని సన్మానిస్తున్న రెడ్డి సేవా సమితి సభ్యులు

**మహబూబ్‌నగర్, జూన్ 21 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్ పర్సన్‌గా కొత్తకోట సీతా దయాకర్ రెడ్డి నియమితులైన సందర్భంగా ఆమెను పాలమూరు రెడ్డి సేవా సమితి సభ్యులు సన్మానించారు. శనివారం సీతా దయాకర్‌రెడ్డి స్వగ్రామం పర్కాపూర్ గలో కలిసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో పాలమూరు రెడ్డి సేవా సమితి ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి వేపూరు రాజేందర్ రెడ్డి, ఉపాధ్యక్షులు వెంకట్రాంరెడ్డి, ప్రచార కార్యదర్శి సురేందర్ రెడ్డి, కార్యదర్శి కోటేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

## ఎట్టకేలకు ఉమ్మడి మండలానికి 451 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు



శివనంపల్లిలో లబ్ధిదారునికి ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి మార్క్ అవుట్ ఇచ్చిన అధికారులు

**ఇటిక్యాల, జూన్ 21 ప్రభాతవార్త:** మండల పరిధిలోని గ్రామాలలో మట్టి మిద్దెలు, గుడిసెలలో నివాసం ఉంటూ ఇందిరమ్మ ఇండ్ల కోసం ఎదురుచూస్తున్న లబ్ధిదారులకు ఎట్టకేలకు రాష్ట్ర ప్రభుత్వం 18 నెలల సమయానికి గాను గ్రామాలలో గల నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లను ప్రభుత్వం మంజూరు చేయగా ఉమ్మడి మండలంలో 29 గ్రామపంచాయతీలో 451 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తూ జిల్లా కలెక్టర్ బిఎం సంతోష్ శనివారం ఎంపీడీవోలకు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన లబ్ధిదారులకు వెంటనే ఇండ్లు నిర్మించుకునేందుకు గాను మార్క్ అవుట్ ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేయగా శనివారం మొదటి రోజు శివన్నంపల్లి గ్రామంలో ఎంపీడీవో మహమ్మద్ హజార్ మోహియుద్దీన్. హౌసింగ్ శాఖ ఏఈ ప్రియాంక, పంచాయతీ కార్యదర్శి మద్దిలేటి ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో 2 ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు మార్క్ అవుట్ ఇచ్చారు. అలాగే ఎర్రవల్లిలో ఎంపీడీవో అబ్దుల్ సయ్యద్ ఖాన్, పంచాయతీ కార్యదర్శి రంగన్న, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో ఇంటి నిర్మాణానికి లబ్ధిదారునికి మార్క్ అవుట్ ఇచ్చారు. అలాగే మొదటి రోజు 7 ఇండ్ల నిర్మాణాలకు మార్క్ అవుట్ ఇచ్చినట్లు అంతేకాక జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రెండు మూడురోజుల్లోగా పంచాయతీ కార్యదర్శులు గ్రామాలలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన లబ్ధిదారులకు ఇంటి నిర్మాణాలకు మార్కవుట్ ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసినట్లు ఎంపీడీవో మహమ్మద్ హజార్ మొహియుద్దీన్ తెలిపారు.

## కత్తెర చిన్న హనుమంతు మృతి బాధాకరం : మాజీ మంత్రి



**రాజాపూర్, జూన్ 21 ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ రాజాపూర్ మండల అధ్యక్షులు కత్తెర కృష్ణయ్య యాదవ్ తండ్రి కత్తెర చిన్న హనుమంతు మృతి చెందడం బాధాకరమని జడ్చర్ల మాజీ శాసనసభ్యులు, మాజీ మంత్రి లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం రాజాపూర్ మండలం దొండ్లపల్లి గ్రామంలో కత్తెర హనుమంతు భౌతిక కాయనికి పూలమాలలు వేసి ఆయన నివాళులర్పించారు. అనంతరం కత్తెర కృష్ణయ్య యాదవ్‌కు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మాజీ మంత్రి లక్ష్మారెడ్డి వెంట పలువురు నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు ఉన్నారు.

## ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం

### ◆యోగాతో సంపూర్ణ ఆరోగ్యం : ప్రధానోపాధ్యాయురాలు వనజ

**జడ్చర్ల జూన్ 21 ప్రభాతవార్త :** నిత్యం యోగ సాధనతో సంపూర్ణ ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవచ్చునని ప్రధానోపాధ్యాయురాలు వనజ అన్నారు. మండల కేంద్రంలోని జడ్చర్ల తె/మీ ప్రాథమిక పాఠశాలలో శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని యోగా సాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో యోగ సాధన చేయించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ యోగ సాధన చేస్తే శరీరం ఉత్తేజంగా ఉండటమే కాకుండా మానసిక ప్రశాంతత కూడా పొందవచ్చు అని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పద్మలీల, సువర్ణ,ఉదయ్ విద్యార్థులు పాల్గొన్నారు.



యోగా చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

### ఆరోగ్యకరమైన జీవనానికి

## యోగాను దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలి

### - నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్



యోగా చేస్తున్న జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, అధికారులు



**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూన్ 21 ప్రభాతవార్త:** భారతీయుల పురాతన సంపద అయిన యోగాను ప్రతి ఒక్కరూ తమ జీవితంలో ఒక భాగం చేసుకోవాలని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ పిలుపునిచ్చారు. ప్రతి సంవత్సరం జూన్21న ప్రపంచ వ్యాప్తంగా నిర్వహించే అంతరాతీయ యోగా దినోత్సవం సందర్భంగా నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ సందేశాన్ని అందించారు. శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ ఆవరణలో అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జిల్లాలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అమరేందర్, దేవ సహాయం, వివిధ శాఖల జిల్లా అధికారులతో కలిసి నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదా వత్ సంతోష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్‌బాదావత్ సంతోష్ మాట్లాడుతూ "యోగ అనేది కేవలం శారీరక వ్యాయామం కాదు. ఇది మనసు, శరీరం, ఆత్మల మధ్య సమన్వయాన్ని సాధించే ఒక ప్రాచీన పద్ధతి. ఈ రోజు ల్లో మనం ఎదుర్కొంటున్న ఒత్తిడి, ఆందోళన, శారీరక రుగ్మ తలకు యోగా ఒక అద్భు తమైన పరిష్కారం" అని అన్నారు. యోగా వల్ల కలిగే ప్రయోజనాలను ఒక సమగ్ర ఆరోగ్య సాధనని, మానసిక ప్రశాంతత నిరంతర ఒత్తిడితో కూడిన ప్రస్తుత జీవనశైలిలో, యోగా మెదడును ప్రశాంతంగా ఉంచ డానికి, ఒత్తిడిని తగ్గించడానికి, మానసిక స్పష్టతను పెంచ డానికి సహాయపడుతుంది. ప్రతి ఒక్కరూ యోగాను అభ్యసించాలని, యోగానుఏదో ఒక రోజుకు మాత్రమే పరిమి తం చేయ కుండా, ప్రతిరోజూ తమ దైనందిన జీవితంలో ఒక భాగంగా చేసుకోవాలని జిల్లా కలెక్టర్ జిల్లా ప్రజలను కోరారు. యోగా ద్వారాప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై దృష్టి సారించి, సమాజానికి మరింత సానుకూల శక్తిని అందించాలని కలెక్టర్ బాదావత్ సంతోష్ పిలుపునిచ్చారు. అనం తరం జిల్లా కలెక్టర్ పోలీస్ పెరేడ్ గ్రౌండ్లో జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ ఆధ్వర్యంలో నిర్వహించిన యోగ కార్య క్రమంలో సైతం కలెక్టర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని పలు ప్రభుత్వ శాఖల అధికారులు, విద్యార్థులు, మరియు స్థానిక ప్రజలుపెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. యోగా నిపుణు లువివిధ ఆసనాలను ప్రదర్శించి, వాటి ప్రయోజ నాలను వివరించారు. ఈ కార్యక్రమం అన్ని శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ వివిధ విభాగాల సూపరిండెంట్లు ఉన్నారు.

## మత్తు పదార్థాల అలవాటుతో భవిష్యత్తు నాశనం

### ◆ డిఎస్పీ ఎన్.లింగయ్య , యాంటీ నార్కోటిక్స్ బ్యూరో డిఎస్పీ బుచ్చయ్య



పోస్టర్లు విడుదల చేస్తున్న డీఎస్పీ

**నారాయణపేట ప్రతినిధి, జూన్ 21 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రాన్ని మత్తు పదార్థాల రహిత రాష్ట్రంగా మార్చడమే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మరియు యాంటీ నార్కోటిక్ బ్యూరో వింగ్ వారి ఆదేశాల మేరకు "నషా ముక్త భారత్ యాంటీ డ్రగ్ దినోత్సవం జూన్ 26 ఉన్నందున యాంటీ డ్రగ్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా డీఎస్పీ ఎన్.లింగయ్యఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని టీఎస్ డబ్ల్యూ ఆర్ఎస్ జూనియర్ కళాశాల విద్యార్థులకు ఓ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన డ్రగ్స్, మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై నారాయణపేట డిఎస్పి ఎన్.లింగయ్య యాంటీ నార్కోటిక్ బ్యూరో డిఎస్పి బుచ్చయ్య లు విద్యార్థులతో మాట్లాడి మత్తు పదార్థాల వినియోగం వలన కలుగు నష్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీలు మాట్లాడుతూ కొంతమంది వ్యక్తులు యువతను లక్ష్యంగా చేసుకొని గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలను అమ్ముతూ బానిసలుగా మారుస్తు యువత భవిష్యత్తు నాశనం చేస్తున్నారన్నారు.యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలంటూ సూచించారు. ఎవరైనా మత్తు పదార్థాలు అమ్మిన, సరఫరా చేసిన, సేవించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు అధికారులతో కలిసి మాదక ద్రవ్యాలు, గంజాయి వాడకంపై పోస్టర్లను ఆవిష్కరించారు. ఐయామ్ ఆన్ యాంటీ డ్రగ్ సోల్జర్‌గా సుమారు180 మంది విద్యార్థులను ఎన్‌రోల్ చేయడం జరిగిందని డిఎస్పి తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐ శివశంకర్, ఎస్ఐ వెంకటేశ్వర్లు, పోలీస్ సిబ్బంది, స్కూల్ టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించండి

### సిఐటియు జిల్లా కార్యదర్శి బండమీది బలరాం





వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

**మాగనూర్,జూన్ 21 ప్రభాతవార్త:** మండల పరిధిలోని వివిధ గ్రామాలలో పనిచేస్తున్న గ్రామపంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ మాగనూర్ మండల పరిషత్ కార్యాలయం ముందు సిఐటియు ఆధ్వర్యంలో శనివారం ధర్నా నిర్వహించారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పుంజనూరు ఆంజనేయులు, జిల్లా కార్యదర్శి బలరాంలు మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికులకు మూడు నెలలు అవుతున్న వేతనాలు ఇవ్వకపోవడంతో వారు ఇబ్బందులకు గురవుతున్నారని విమర్శించారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుతూ, మంచినీరు అందిస్తూ వీధి దీపాలు వెలిగిస్తూ ప్రజల శ్రేయసే తమ శ్రేయస్సుగా పనిచేస్తున్న గ్రామపంచాయతీ కార్మికుల వేతనాలు ఇవ్వకుండా,వారితో వస్తులతో పనిచేయించుకోవడం దారుణమని మండిపడ్డారు. గత మూడు సంవత్సరాలుగా గ్రామపంచాయతీ కార్మికులకు యూనిఫాం, చెప్పులు, బూట్లు, చీపురు కట్టలు తదితర పనిముట్లు ఇవ్వడం లేదని సొంత డబ్బులతో పనిముట్లు కొనుక్కొని పనిచేస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా గ్రామపంచాయతీ కార్మికులకు కనీస వేతనం 18 వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేసి కరోబాలను ప్రత్యేక కార్యదర్శులుగా గుర్తించాలన్నారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడుకున్న వినతిపత్రం ఎంపీడీవో రహేమతుద్దీన్,ఎంపీఓ విజయలక్ష్మిలకు వినతి పత్రం అందజేశారు .ఈ ధర్నాలో గ్రామపంచాయతీ ఉద్యోగ కర్మల సంఘం మాగనూర్ మండల అధ్యక్షులు అశోక్, నాయకులు హనుమంతు, చెప్ప ఆశప్ప, అనీఫ్, నర్సింలు, బసవరాజు తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## ప్రొఫెసర్ జయశంకర్‌కు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న విశ్వకర్మలు

**నారాయణపేట ప్రతినిధి, జూన్ 21 ప్రభాతవార్త:** నారాయణపేట పట్టణంలోని నర్సిరెడ్డి చౌరస్తాలో ప్రొ॥ జయశంకర్ 14వ వర్ధంతి వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా జిల్లా విశ్వకర్మ సంఘం నాయకులు జయశంకర్ ఫొటోకి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా విశ్వకర్మ నాయకులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రొఫెసర్ జయశంకర్ చేసిన పోరాటాలు చిరస్మరణీయమని, తెలంగాణ ఉద్యమానికే తన జీవితాన్ని అంకితం చేసి ఆజన్మ బ్రహ్మచారిగా జీవించారని అన్నారు. తెలంగాణలోనే కాకుండా, దేశంలోని ఇతర ప్రాంతాల్లో, విదేశాల్లో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఆవశ్యకత గురించి ప్రసంగాలు చేశాడు. జయశంకర్ తన ఆస్తిని, జీవితాన్ని తెలంగాణ కోసం అంకితం చేశాడు. అబ్ తొ ఏక్ హీ ఖ్వాయిష్ హై, వొ తెలంగాణ దేఖ్‌నా ఔర్ మర్‌జానాఖీ ఇప్పుడైతే నాకు ఒకే కోరిక మిగిలింది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కళ్ళారా చూడాలి, తర్వాత మరణించాలని అనేవాడు అని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కళ్ళారా చూడాలని తరుచుగా చెప్పే జయశంకర్ 2011 జూన్ 21న ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు ముందే మరణించడం చాలా బాధాకరమన్నారు. ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఒక్కరూ ప్రజా సేవలో నిమగ్నమవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వకర్మ మోనేశ్వర సంఘం నాయకులు గౌరవ అధ్యక్షులు నాగేంద్ర చారి, చారి ఉపాధ్యక్షులు రాజన్న చారి, అధ్యక్షులు గోవింద్ చారి, మోహన్ రాజ్ విశ్వకర్మ, మోనేష్ చారి, ఆంజనేయులు చారి, రాఘవేందర్ చారి, సౌభాగ్య, వెంకటేష్ చారి, శ్రీనివాస్ చారి, అభిలాష్ చారి, అనిల్ చారి తదితరులు పాల్గొన్నారు.

## పెబ్బేరు మండల మహిళా సమైక్య సంఘం ఏకగ్రీవంగా ఎన్నిక



**పెబ్బేర్, జూన్ 21 ప్రభాతవార్త :** పెబ్బేరు మండలంలోని మహిళా సంఘం సమావేశం ఏర్పాటు చేసి సమైక్య అధ్యక్షురాలను, ఉపాధ్యక్షులను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. మండల మహిళ సమైక్య అధ్యక్షురాలుగా ఇందిర, ఉపాధ్యక్షురాలుగా ముష్టి పద్మమ్మ, కార్యదర్శిగా భాగ్యమ్మ, కార్యదర్శిగా లక్ష్మి, కోశాధికారిగా ప్రమీల, మండల సమైక్య ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేసుకొని మండల అధ్యక్షురాలను ఉపాధ్యక్షులను ఎన్నుకోవడం జరిగింది. పెబ్బేరు వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ప్రమోదిని, మాజీ సర్పంచి అక్కి సుశీల శ్రీనివాస్ గౌడ్ వ్యవసాయ మార్కెట్ యార్డులో శాలువాతో సన్మానించి వారికి అభినందనలు తెలిపారు. ఈ సమావేశం మండల ఏపీఓ అధికారి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ ప్రమోదిని, మాజీ సర్పంచ్ అక్కి సుశీల శ్రీనివాస్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాసులు గౌడ్, మాజీ సర్పంచ్ సురేందర్ గౌడ్, మార్కెట్ డైరెక్టర్లు రామన్ గౌడ్, మోతే రాములు, మాజీ ఎంపీటీసీ రాజగౌడ్, వినయ్ కుమార్, నిరంజన్ రెడ్డి, రాఘవేంద్ర చారి, భాను తదితరులు పాల్గొన్నారు.

## ఐశ్వర్య గణపతిని దర్శించుకున్న మాజీ మంత్రి లక్ష్మారెడ్డి

**జడ్చర్ల, జూన్21 ప్రభాతవార్త:** తిమ్మాజిపేట మండలంలోని ఆవంచ గ్రామంలో వెలసిన ఏకాశిలా ఐశ్వర్య గణపతిని మాజీ మంత్రి, బిఆర్ఎస్ మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు డా. లక్ష్మారెడ్డి సందర్శించారు. సందర్భంగా గ్రామస్తులు స్థానిక నాయకులతో కలిసి ఐశ్వర్య గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం దినదినాభివృద్ధి చెందడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఐశ్వర్య గణపతి మండపం అభివృద్ధికి తన పూర్తి సహకారం ఉంటుందని చెప్పారు. నాయకులు కొడుగల్ యాదయ్య, ప్రణిల్ చందర్, నాగిరెడ్డి, దర్శన్, గ్రామస్తులు పరమేష్ సాదే తదితరులు పాల్గొన్నారు.



ఐశ్వర్య గణపతి వద్ద పూజలు చేస్తున్న మాజీ మంత్రి లక్ష్మారెడ్డి, నాయకులు, గ్రామస్తులు

## రూ.352.557 కోట్ల రైతు భరోసా నిధులు జమ

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూన్ 21 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని అందుకే రైతు భరోసా సహాయం సకాలంలో విడుదల చేస్తుందని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. వ్యవసాయ రంగం రైతు భరోసా పథకం కింద ఇప్పటి వరకు నాగర్ కర్నూల్ జిల్లాలోని 2,84,557 మంది రైతుల ఖాతాల్లో రూ.352.557 కోట్ల నిధులు జమ అయ్యాయని శనివారం నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ తెలిపారు. వానాకాలం 2025 సీజన్‌కు సంబంధించి జిల్లాలో రైతులకు నిధులను నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తోందని పేర్కొన్నారు.రైతుల ప్రయోజనాలకు అనుగుణంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతి ఎకరానికి 6000 రూపాయలను రైతుల ఖాతాల్లోకి విడుదల చేస్తూ వ్యవసాయ పనుల సహకారాలకు తోడ్పాటుఅందిస్తుందని కలెక్టర్ తెలిపారు. రైతులు తమ భూముల పంటలకు అవసరమైన ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు తదితర వ్యవసాయ పనుల కోసం రైతు భరోసా నిధులను ఖర్చు చేసుకోవాలని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ఈ సందర్భంగా కోరారు.

## కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కృష్ణయ్య యాదవ్‌కు పితృ వియోగం

**రాజాపూర్, జూన్ 21 ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీ రాజాపూర్ మండల అధ్యక్షులు కత్తెర కృష్ణయ్య యాదవ్ తండ్రిగారైన కత్తెర చిన్న హన్మంతు నేడు రాజాపూర్‌మండలం దొండ్లపల్లి గ్రామంలో స్వర్గస్తులైనారు.గత మూడు నెలల క్రితం తన తల్లిని కోల్పోయిన కత్తెర కృష్ణయ్య యాదవ్ ఆ బాధ నుంచి తేరుకోక ముందే తండ్రిని కోల్పోవడం పట్ల ఆ కుటుంబ సభ్యుల భాదవర్ణనాతీతం.రేపు ఆదివారం దొండ్లపల్లి గ్రామంలో కత్తెర చిన్నహనుమంతు అంత్యక్రియలు జరగనున్నట్లు కాంగ్రెస్ పార్టీ రాజాపూర్ మండలఅధ్యక్షులు,ఆయన కుమారుడు కత్తెరకృష్ణయ్య యాదవ్ తెలిపారు.

## ఇందిరమ్మ ఇల్లు నిర్మాణానికి భూమి పూజ



ఇందిరమ్మ ఇల్లు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎంపీఓ, కాంగ్రెస్ నాయకులు

**పెబ్బేరు, జూన్ 21 ప్రభాతవార్త:** పెబ్బేరు మండలం రామాపురం గ్రామంలో తెలంగాణ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం చేపట్టిన పేదింటి కల నెరవేర్చడమే లక్ష్యంగా ఇందిరమ్మ ఇల్లు నూతన నిర్మాణానికి నేడు పేదింటివారికి ఇండ్ల మంజూరు చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు రేవంత్‌రెడ్డి, వనపర్తి ఎమ్మెల్యే తూడి మెగా రెడ్డి,కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వానికి లబ్ధిదారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిఓ రోజా,పంచాయతీ కార్యదర్శి భాస్కర్ నాయక్, మండల కాంగ్రెస్ సీనియర్‌నాయకులు సత్యనారాయణ రెడ్డి,కోరి కురుమన్న,మిద్దె బాలరాజు యాదవ్,హుస్సేన్ పీర్, పుట్ట రాముడు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## స్వచ్ఛ గ్రామాల వైపు ప్రయాణం ప్రారంభం

(మొదటి పేజీ తరువాయి)

పరిశుభ్రత, తాగునీరు ఆరోగ్యం తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి తగిన విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఇండ్ల నిర్మాణాలను కావాల్సిన ఇసుక, గ్రామీణ ప్రాంతాల్లో నిర్దేశించిన రేట్ ప్రకారమే స్టీలు, సిమెంటు, ఇటుకలు, లేబర్, సెంట్రింగ్ పనులకు ఆటంకం కలగకుండా చూడాలని కలెక్టర్ ఎంపీడీవోలను ఆదేశించారు. ముఖ్యంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పనులను వేగవంతం చేయాలని, వారం వారం పురోగతి పనులపై సమీక్షలు తీసుకుంటామని, అందుకే అనుగుణంగా క్షేత్రస్థాయిలో పనులు పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులు ఆదేశించారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పచ్చదనాన్ని మరింత విస్తరింప చేయాలని లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏడాది మొక్కలు పెంచే కార్యక్రమాన్ని వనమహోత్సవ కార్యక్రమంగా అమలు చేస్తుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. వనమహోత్సవంలో అన్ని రకాల శాఖల అధికారులు పాల్గొని పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. అడవులను కాపాడే బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. జిల్లాలో 40 లక్షల మొక్కలు నాటాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. అన్ని రకాల శాఖల అధికారులు పారిశ్రామిక వేత్తలు ఈ కార్యక్రమంలో భాగంగా కావాలని సూచించారు. అనంతరం స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ 2025 పోస్టరును ఆవిష్కరించినారు. ఈ సమావేశంలో డిప్యూటీ సీఈవో గోపాల్ నాయక్, పిడి డిఆర్డిఏ చిన్న ఓబులేసు, డిపిఓ రామ్ మోహన్ రావు, అదనపు పిడి రాజేశ్వరి తదితరులు ఉన్నారు.

## యోగా మన నిత్యజీవితంలో ఒక భాగం కావాలి

(మొదటి పేజీ తరువాయి)

యోగా వల్ల కలిగే శారీరక, మానసిక, ఆధ్యాత్మిక, ఆరోగ్య ప్రయోజనాల గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని, అలాగే ఆచరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పతాంజలి యోగ సమితి భారత స్వాభిమాన్ ట్రస్ట్ సభ్యులతో పాటు తదితరులు ఉన్నారు.

## ఆరోగ్య సమస్యలను దూరం చేసేందుకే యోగా

(మొదటి పేజీ తరువాయి)

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ జి వెంకటేశ్వర్లు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. శ్రీనివాసులు, యువజన క్రీడల అధికారి సుధీర్ రెడ్డి, యోగా కార్యదర్శి సుగుణ, ఆయుష్ విభాగం డా. మంజుశ్రీ, డా.ఒమర్ అలీ, డా.జ్యోతి, జిల్లా అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మహబూబ్‌నగర్ అభివృద్ధికి సహకరించాలి

(మొదటి పేజీ తరువాయి)

మర్యాదపూర్వకంగా కలిసి వారికి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియ జేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహబూబ్ నగర్ వెనుకబడిన ప్రాంతమని మా ప్రాంతాభివృద్ధికి అన్ని విధాలా సహకరించాలని ఆయన మంత్రులను కోరారు. ఎమ్మెల్యేతో పాటు రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పోరేషన్ చైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్ ఉన్నారు.

## రాచూరు బీటీ రోడ్డును పూర్తి చేయలి

(మొదటి పేజీ తరువాయి)

కంకరతో సరిపెట్టారని, నేటికి బీటి రోడ్డు నిర్మాణం పూర్తి చేయలేదన్నారు. ప్రతినిత్యం మండల కేంద్రానికి రాచూరు గ్రామస్తులు వెళ్లాలంటే అనేక ఇబ్బందులు పడుతున్నారని, వర్షాకాలంలో తీవ్ర అవస్థలు పడుతున్నారన్నారు. రాచూరు గ్రామస్తుల బిటి రోడ్డు కళను సాకారం చేయాలన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి స్పందించి బీటీ రోడ్డు పనులు పూర్తి చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీటీ రోడ్డు పూర్తి చేయకపోతే రాష్ట్ర ప్రభుత్వం సిఫారసు చేస్తే.. ప్రధానమంత్రి సడక్ యోజన పథకం ద్వారా బీటీ రోడ్డు పనులు పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలోమండల బీజేవైఎం ఉపాధ్యక్షులు బెక్కరి సురేష్ రెడ్డి, కొవ్వూరు గంగాధర్ రావు, గణేష్ పలువురు బీజేపీ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.